PRAJAPAKSHAM ★

తాతలనాటి కథలు
రూ॥ 70/-
పేజీలు: 64


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్), హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

2024, మార్చి 19 మంగళవారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 271, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: Hyderabad
Khammam, Karimnagar, Mahabubnagar



గవర్నర్ పదవికి

## తమిళిసై రాజీనామా

**బాధ్యతల్లో ఉన్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి కూడా....**

**లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు నుంచి పోటీ!**

ప్రజాపక్షం/హైదరాబాద్

తమిళిసై సౌందరరాజన్ రాష్ట్ర గవర్నర్ పదవితో పాటు అదనపు బాధ్యతల్లో ఉన్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికీ సోమవారం రాజీనామా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు నుంచి తమిళిసై పోటీ చేయనున్నారు. బిజెపి నుంచి పోటీ చేసేందుకు వీలుగా తమిళిసై రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ మేరకు రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు పంపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సోమవారం ఉదయం తమిళిసై మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అనంతరం రాజీనామాపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడుకు చెందిన తమిళిసై సౌందరరాజన్, 2019 సెప్టెంబర్ 8న తరువాయి 2లో

సంపూర్ణ సమాచారం

# 21లోగా వెల్లడించాలి

## ఎలక్టోరల్ బాండ్లపై ఎస్‌బిఐకి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ:** ఎంపిక చేసిన అంశాలకే పరిమితం కాకుండా, ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని ఈనెల 21వ తేదీలోగా వెల్లడించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ బాండ్లను కొనుగోలుదారులు, గ్రహీత రాజకీయ పార్టీల మధ్య సంబంధాన్ని బహిర్గతం చేసేలా, విశిష్ట బాండ్ నంబర్లను కూడా ప్రకటించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జెబి పార్ధీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. ఎస్‌బిఐ తన ఆధీనంలో ఉన్న అన్ని వివరాలను, ఏ విధమైన 'ఎంపిక'లు లేకుండా వెల్లడించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఎస్‌బిఐ నుంచి స్వీకరించిన వివరాలను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపింది. 2018లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశట్టిన ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ (ఇబిఎస్) రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ బాండ్ల జారీని రద్దు చేస్తూ, 2019, ఏప్రిల్ 11 నుంచి 2024, ఫిబ్రవరి 15 వరకూ జారీ చేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలు సమర్పించాలని ఎస్‌బిఐని ఆదేశించింది. వివరాలను ఇసిఐకి కూడా ఇవ్వాలని సూచించింది. మార్చి 13లోగా ఇసిఐ ఈ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని ఆదేశించింది. గోప్యతా అంశాల నేపథ్యంలో, డీకోడింగ్ ఆలస్యమవుతుందని, కాబట్టి వివరాలు అందించేందుకు జూన్ 30వ తేదీ వరకూ గడువు పెంచాలన్న ఎస్‌బిఐ విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. దీనితో ఎస్‌బిఐ కొంత సమాచారాన్ని సమర్పించగా, దానిని ఇసిఐ వెబ్‌సైట్‌లో ఉంచింది. కాగా, అసంపూర్ణ సమాచారాన్ని అందించినందుకు తరువాయి 2లో




సుప్రీంలో కవిత

# స్క్వాష్ పిటిషన్

**ఢిల్లీ మద్యం కేసు నుంచి తన పేరును తొలగించాలని వినతి**

**ఆప్ నాయకులతో కలిసి కుంభకోణానికి పాల్పడ్డారన్న ఇడి**



**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కుమార్తె, ఎంఎల్‌సి కవిత పునరుద్ఘాటించారు. రాజకీయ దురుద్దేశంతోనే తనను అనవసరంగా ఇరికించారని పేర్కొన్నారు. తన పేరును తొలగించడంతోపాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఇప్పటి వరకూ చేపట్టిన చర్యలను పక్కనపెట్టాలని కోరుతూ ఆమె సోమవారం సుప్రీం కోర్టులో స్క్వాష్ పిటిషన్ దాకలు చేశారు. కవిత తరఫున పిటిషన్ వేసిన అడ్వొకేట్ నితేష్ రాణా తన క్లయింట్ నిర్దోషి అని పేర్కొన్నారు. ఇడి అక్రమంగా ఆమెను అరెస్టు చేసిందని ఆరోపించారు. కవితపై ఇప్పటి వరకూ జరిపిన విచారణను, నేరారోపణలను, అరెస్టును రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ కేసు నుంచి కవిత పేరును తొలగించాలని సుప్రీం కోర్టును కోరారు. అయితే, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలతో కలిసి కవిత రూ. 100 కోట్ల భారీ తరువాయి 2లో




బెంగాల్ డిజిపి సహా ఆరు రాష్ట్రాల

## అధికారులపై ఇసి కొరడా

**న్యూఢిల్లీ:** దేశంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల హోంశాఖ కార్యదర్శులను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా పశ్చిమబెంగాల్ డిజిపిని ఆ బాధ్యతల నుంచి తప్పించింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఎన్నికల సంఘం ఈమేరకు చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి. బృహన్ ముంబయి మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్‌సింగ్ చాహల్‌తో పాటు అదనపు కమిషనర్లు, ఉప కమిషనర్లపైనా వేటు పడింది. మిజోరం, హిమాచల్ ప్రదేశ్‌ల సాధారణ పరిపాలనా విభాగాల కార్యదర్శులను కూడా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. సిఇసి తరువాయి 2లో



ఢిల్లీలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

కోడ్‌ను ఉల్లంఘిస్తే

# కఠిన చర్యలు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు

రోడ్‌షోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

హోమ్ ఓటింగ్‌కు ఏప్రిల్ 22లోపు దరఖాస్తు చేసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్




ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ హెచ్చరించారు. ఎన్నికలకు అన్ని విధాలా అధికారులను సంసిద్ధం చేశామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రోడ్‌షోలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, రాత్రి 10గంటల నుండి ఉదయం 6గంటల వరకు ఎవ్వరూ స్పీకర్లు వాడొద్దని, ఎవరైనా నిబంధనలను పాటించాలని సూచించారు. హైదరాబాద్, బిఆర్‌కె భవన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వికాస్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 3.30 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇందులో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 1.94 లక్షల మంది, దివ్యాంగ ఓటర్లు 5.26 లక్షల మంది ఉన్నారని వివరించారు. ఇంటి వద్ద ఓటింగ్ కోసం ఫారం డి పంపిణీ చేయాలని, ఇందుకు ఏప్రిల్ 22 వరకు తరువాయి 2లో



# కె.శ్రీనివాస్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు

## 'ప్రజాపక్షం' ఎడిటర్‌గా ఎం.సుబ్బారావు బాధ్యతలు

ప్రజాపక్షం / హైదరాబాద్

ప్రజాపక్షం తెలుగు దినపత్రిక సంపాదకులుగా సీనియర్ జర్నలిస్టు మక్కెన సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్‌రెడ్డి నియమితులు కావడంతో ఇప్పటివరకు సంపాదకులుగా ఉన్న ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బండ్లగూడలో 'ప్రజాపక్షం' ప్రధాన కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కె.శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. ఇదే సందర్భంగా మక్కెన సుబ్బారావు సంపాదకులుగా బాధ్యతలు తీసుకున్నారు. నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, గవర్నింగ్ బాడీ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ తదితరులు శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మక్కెన సుబ్బారావుకు కూడా శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. సంపాదకుడుగా పత్రి క ఆవిర్భావం నుండి శ్రీనివాస్‌రెడ్డి చేసిన అవిశ్రాంతసేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడా రు. అటు ప్రజాపక్షం పత్రిక అభివృద్ధికి, ఇటు పాత్రికేయవృత్తి విలువలతోపాటు వారి సంక్షేమాభివృద్ధికి శ్రీనివాస్‌రెడ్డి సవ్యసాచిలా విశిష్ట కృషి చేశారని ప్రశంసించారు. ఆయన సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో పత్రికా విలువలు సమున్నతంగా వర్ధిల్లగలవని వారు ఆకాంక్షించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, పత్రికా రంగంలో ప్రజాపక్షం దినపత్రిక విభిన్నమైనదని, లక్ష్యసాధనలో పత్రిక మరింత అభివృద్ధి పథంలో సాగేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో సేవలు అందించాలని హిత వు చెప్పారు. మక్కెన సుబ్బారావు మాట్లాడుతూ, వామపక్ష జర్నలిజంలో ఐదు దశాబ్దాల ప్రస్థానంలో శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పత్రికా సిబ్బంది భాషపై తరువాయి 2లో

బిఆర్‌ఎస్, బిజెపి కుట్రలు చూస్తూ ఊరుకోవాలా 03

రికార్డుస్థాయిలో లోక్‌సభ ఎన్నికల ఖర్చు! 04



ఢిల్లీ జల్‌బోర్డు కేసులో

## ఇడి విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ జల్‌బోర్డ్ అవకతవకలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గైర్హాజరయ్యారు. దీనిపై స్పందించిన అమ్ ఆద్మీ పార్టీ, ఇడి అధికారులు జారీ చేసిన సమన్లు అక్రమమని, చట్ట వ్యతిరేకంగా జారీ చేశారని ఆరోపించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిజెపి కేంద్ర దర్యాప్తు సంస్థలతో కేజ్రీవాల్‌ను టార్గెట్ చేసిందని పేర్కొంది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేయడంపై ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. 'అరవింద్ కేజ్రీవాల్ ఇండియా కూటమితో కలిసి ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే బిజెపికి ఆటంకాలు వస్తాయని భావిస్తోంది. కేజ్రీవాల్‌ను ఎలాగైనా జైలుకు పంపించాలని అనుకుంటుంది. ఢిల్లీ మద్యం కేసులో బెయిల్ వచ్చే సరికి కొత్త కేసును తీసుకొచ్చారు' అని సౌరభ్ విమర్శించారు. మరోవైపు జల్‌బోర్డ్‌లో అవకతవకలకు సంబంధించి తరువాయి 2లో

'శక్తి' పదంపై

## నా మాటలను వక్రీకరించారు

**ప్రధాని మోడీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు**

**న్యూఢిల్లీ:** తాను వాడిన 'శక్తి' అనే పదాన్ని వక్రీకరించారని ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'శక్తి' (అధికారం)ని అంతం చేయడమే లక్ష్యంగా మేనిఫెస్టోను సిద్ధం చేశామని ముంబయిలో ఆదివారం జరిగిన ర్యాలీలో రాహుల్ పేర్కొగా, ప్రధాని ఆ మాటలను తప్పుపట్టారు. కోట్లాది మంది పూజించే 'శక్తి' స్వరూపిణిని నాశనం చేస్తామని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. తన దృష్టిలో దేశంలోని ప్రతి తల్లి, చెల్లి 'శక్తి' మాతలేనని పేర్కొన్నారు. కాగా, ప్రధాని విమర్శలపై రాహుల్ సోమవారం తరువాయి 2లో

తెలంగాణను దోచుకున్నవారిని

# ఎవరినీ వదిలిపెట్టం


**కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకు రాజకీయం చేస్తున్నాయి**

**జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని మోడీ**

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి



కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకు రాజకీయాలు చేస్తున్నాయని, దేశంలో ఏ దోపిడీని పరిశీలించినా దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. బిజెపి విజయ సంకల్ప సభ సోమవారం జగిత్యాల జిల్లాలోని గీతా విద్యాలయం గ్రౌండ్‌లో జరిగింది. సభకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అధ్యక్షత వహించారు. తెలుగులో ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోడీ మే 13న లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించనున్నారని స్పష్టం చేశారు. తనకు ప్రతి మహిళ తరువాయి 2లో



తిరుప్పూర్, నాగపట్నం నుంచి

## సుబ్బరాయన్, సెల్వరాజ్ పోటీ

**చెన్నై :** తమిళనాడులో డిఎంకె నేతత్వంలోని కూటమిలో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సోమవారం తిరుప్పూర్ సిట్టింగ్ ఎంపి కె.సుబ్బరాయన్‌ను తన సొంత నియోజకవర్గం నుంచి ప్రజల తీర్పును కోరడానికి మళ్లీ అభ్యర్థిగా ఎంపిక చేసింది. నాగపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వై.సెల్వరాజ్‌ను పోటీకి దింపినట్లు సిపిఐ కార్యదర్శి తరువాయి 2లో

# ఎన్నికల వేళ హై అలర్ట్

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై గట్టి నిఘా

త్వరలో అంతర్రాష్ట్ర పోలీస్ అధికారుల సమావేశం



ప్రజాపక్షం/భద్రాచలం

లోక్‌సభ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో హై అలెర్ట్ కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రాలతో పాటు పలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆయా రాష్ట్రాల పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. మావోయిస్టుల ప్రాభల్యం ఉన్న ప్రధాన రాష్ట్రాలు నాలుగైదు గొలుసుకట్టుగా ఉండటంతో అధికారులు గట్టి నిఘా పెడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల సమాంతరం పాలన సాగుతున్న వేళ ఈ మధ్యకాలంలో కేంద్ర కోబ్రా బలగాలు మావోయిస్టు నేత హిడ్మా ఇలాకాలో అత్యంత తరువాయి 2లో

# వృద్ధులు... దివ్యాంగులకు ఆన్‌లైన్ ఓటింగ్

## మాజీ సీఈసీ కృష్ణమూర్తి సూచన

**న్యూఢిల్లీ** : సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు, యూనిఫాం సర్వీస్‌ల సభ్యులకు ఆన్‌లైన్ ఓటింగ్ సదుపాయం కల్పించాలని భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి సోమవారం సూచించారు. రాజకీయ పార్టీలు డిజిటల్ మీడియా శక్తిని ఉపయోగించుకుని, భౌతిక బహిరంగ సభల సంఖ్యను తగ్గించి ఆన్‌లైన్ ప్రచారాన్ని ఎక్కువగా ఎంచుకునే అవకాశాన్ని తీవ్రంగా అన్వేషించాలన్నారు. కృష్ణమూర్తి పీటీఐతో మాట్లాడుతూ తాను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా ఉన్న సమయంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఆన్‌లైన్ ఓటింగ్ ఎంపికలను ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలించామని, ఐఐటీ మద్రాస్‌తో అనధికారిక సంప్రదింపులు కూడా జరిగాయని చెప్పారు. అయితే ఓటింగ్ సమయంలో గోప్యతను ఉల్లంఘించే అవకాశం ఉందని పేర్కొంటూ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయని ఆయన అన్నారు. 'ఇంటర్నెట్ ఓటింగ్‌ను అనుమతించిన దేశాలు ఉన్నప్పటికీ, మనం రాజకీయ పార్టీల (భారతదేశంలో) సమ్మతితో కొనసాగించాలి. కనీసం ప్రారంభంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, యూనిఫాం సేవల్లో ఉన్న వారందరికీ ఇంటర్నెట్ ఓటింగ్ ఇవ్వవచ్చు' అని చెప్పారు. 'మనం దాని గురించి తీవ్రంగా ఆలోచించాలి' అని కృష్ణమూర్తి అన్నారు. డిజిటల్ రంగంలో భారతదేశం సాధించిన పురోగతితో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం కోసం భౌతిక సమావేశాల సంఖ్యను తగ్గించగలరా లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం, భారతదేశం ఎన్నికల ముందు 'చాలా' బహిరంగ సభలను చూస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో తన మెక్సికో పర్యటనను గుర్తు చేసుకుంటూ, కృష్ణమూర్తి అక్కడ చాలా తక్కువ భౌతిక బహిరంగ సభలను చూశానని, ఎక్కువ ప్రచారం టీవీ, ఆన్‌లైన్‌లో జరిగిందన్నారు. 'ఇవి మనం పరిశీలించాల్సిన విషయాలు' అని ఆయన అన్నారు. అయితే ఇంత పెద్ద పరిమాణంలో ఉన్న దేశం అయినందున మనం (భారతదేశం) జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఎందుకంటే ఇది అనవసరమైన ద్వేషం, హింస, అలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నందున భౌతిక ప్రచార ర్యాలీల సంఖ్యను తగ్గించడం చాలా అవసరం' అని తెలిపారు.

# కోల్‌కతాలో కుప్పకూలిన భవనం

## ఐదుగురి మృతి...ఏడుగురికి తీవ్ర గాయాలు



**కోల్‌కతా**: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో నిర్మాణంలో ఉన్న ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందగా... ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో పది మందిని సహాయక సిబ్బంది కాపాడారు. శిథిలాల కింద మరికొంత మంది ఉండొచ్చన్న అనే అనుమానంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు నగర మేయర్ ఫిర్హాద్ హకీమ్ తెలిపారు. ఈ ఘటన ఆదివారం రాత్రి గార్డెన్ రిచ్ ప్రాంతంలో జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... 'ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వలేదు. ఈ భవన నిర్మాణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఘటనపై దర్యాప్తును చేపట్టారు. మతుల కుటుంబాలకు రూ.ఐదులక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం అందిస్తాం. ఈ ఘటన వల్ల సమీపంలో ఉన్న ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం వారికి కూడా సహాయం చేస్తుంది' అని మమతా బెనర్జీ తెలిపారు. ఘటన జరిగిన భవనంలో ఎవరూ లేరని స్థానికులు తెలిపారు. కానీ, దాని పరిసర ప్రాంతాల్లో పేదలు నివసిస్తున్న గుడిసెలపై శిథిలాలు పడ్డాయని చెప్పారు. వాటిలో ఎవరైనా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. పదుల సంఖ్యలో శిథిలాల్లో చిక్కుకొని ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని నగర సీపీ వినీత్ గోయల్ తెలిపారు. ఈ ఘటనపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. కావాల్సిన సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ప్రభుత్వానికి 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు.

## సుబ్బరాయన్, సెల్వరాజ్ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

కె.నారాయణ ఇక్కడ రెండు రోజుల సమావేశం ముగింపు సందర్భంగా ప్రకటించారు. సీట్ల పంపకాల చర్చల్లో అధికార డిఎంకె ఈ రెండు నియోజకవర్గాలను సిపిఐకి కేటాయించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తరాసన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడులో ఏప్రిల్ 19న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 39 నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు పూర్తిస్థాయి ప్రచారాన్ని చేపట్టేందుకు వీలులేకుండా పోయిందని తెలిపారు. మరోవైపు డిఎంకెకు కేటాయించిన తిరుచిరాపల్లి స్థానం నుంచి తన కుమారుడు దురై వైకో పోటీ చేస్తారని డిఎంకె మరో మిత్రపక్షం మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండిఎంకె) అధినేత వైకో ప్రకటించారు. ఎండిఎంకె ప్రధాన కార్యదర్శిగా దురై పదోన్నతి పొందారు.

## 21లోగా వెల్లడించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌బిఐని సుప్రీం కోర్టు హెచ్చరించింది. ప్రత్యేకమైన ఆల్ఫాన్యూమరిక్ నంబర్లను బహిర్గతం చేయకపోవడానికి గల కారణాలను వివరించాలని కోరుతూ ఎస్‌బిఐకి నోటీసు జారీ చేసింది. బాండ్ల వివరాలను వెల్లడించేందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవని ఎస్‌బిఐ వ్యాఖ్యానించింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఆర్డర్‌ను పూర్తిగా అమలు చేయడంతోపాటు, భవిష్యత్తులో తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి వీలుగా, ఎస్‌బిఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎలక్టోరల్ బాండ్ల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఈనెల 21వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని తెలిపింది. ఎలక్టోరల్ బాండ్ల నంబర్లు, ఇతర వివరాలను ఇవ్వాలని పేర్కొంది. ఈ కేసులో పరిశ్రమ సంస్థలు, అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ)కి సంబంధించి జాబితా చేయని అభ్యర్థనలపై విచారణను బెంచ్ తిరస్కరించింది. అంతేగాక, 2018, మార్చి 1 నుంచి 2019, ఏప్రిల్ 11వ తేదీ వరకు విక్రయించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తును స్వీకరించేందుకు కూడా సుప్రీంకోర్టు నిరాకరించింది.

## కేజ్రీవాల్ గైర్హాజరు (మొదటి పేజీ తరువాయి)

మనీలాండరింగ్ కేసులో ఇడి దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ సోమవారం ఇడి కార్యాలయానికి వచ్చి విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. అయితే కేజ్రీవాల్ ఈ విచారణకు గైర్హాజరయ్యారు. కాగా, మనీలాండరింగ్ చట్టం కింద కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేసిన రెండో కేసు ఇది. ఇప్పటికే ఢిల్లీ మద్యం కేసులో ఆయనపై అభియోగాలు ఉండటం వల్ల ఇడి తొమ్మిది సార్లు నోటీసులు జారీ చేసింది.

సత్యేందర్ జైన్ బెయిల్ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం కోర్టు

మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత సత్యేందర్ జైన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్న సత్యేందర్‌ను వెంటనే లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది. వారం రోజుల్లోగా లొంగిపోయేందుకు అనుమతించాలంటూ జైన్ తరఫు న్యాయవాది కోరిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 2017లో అవినీతి నిరోధక చట్టం కింద సత్యేందర్ జైన్‌పై కేసు నమోదయ్యింది. సిబిఐ కేసు ఆధారంగా ఇడి సైతం ఆయనపై కేసు నమోదు చేసింది. జైన్‌కు చెందిన నాలుగు కంపెనీలలో మనీలాండరింగ్ జరిగినట్లు ఇడి ఆరోపిస్తోంది. ఈ కేసులో జైన్‌ను 2023 మే 30న అరెస్ట్ చేసింది.

# బీహార్‌లో ఘోరం

## రోడ్డుప్రమాదంలో 8మంది దుర్మరణం



**పాట్నా:** బీహార్‌లోని ఖగారియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్, కారు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఎనిమిది మంది దుర్మరణం చెందారు. వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో పెళ్లింట తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఖగారియాలో పెళ్లి ఊరేగింపు నుంచి తిరిగి వస్తున్న కారును పస్రాహా పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై విద్యానంద్ పెట్రోల్ పంప్ సమీపంలో సిమెంట్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న కాలువలోకి బోల్తా పడింది. ఈ ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు చిన్నారులు కూడా మరణించడం అందర్నీ కలచివేసింది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం కోసం అస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా ప్రమాదం జరిగిందని గోగ్రి డీఎస్పీ రమేశ్‌కుమార్ తెలిపారు. ప్రమాద సమయంలో కారు వేగంగా వెళుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం తర్వాత ఆ ప్రాంతమంతా భీతావాహంగా మారింది. స్థానికులు భారీగా ఘటనా స్థలానికి తరలివచ్చారు. ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతింది.

## ఎవరినీ వదిలిపెట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఒక శక్తి స్వరూపంలా కనిపిస్తోందన్నారు. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతాన్ని కూడా శివశక్తి అని పేరు పెట్టుకున్నామని, శక్తిని వినాశనం చేసేవాళ్లకు, శక్తికి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరుగుతోందని వెల్లడించారు. తాను భారతమాతకు పూజారినని, శివాజి మైదానంలో రాహుల్‌గాంధీ తన పోరాటం శక్తికి వ్యతిరేకంగా అని చెప్పారని శక్తిని వినాశనం చేస్తానని ఎవరైనా అంటారా అని ప్రశ్నించారు. శక్తిని ఖతమ్ చేస్తానన్న రాహుల్‌గాంధీ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నానని, శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తెలుస్తుందన్నారు. ఆంగ్లేయులు, రజాకార్లపై తెలంగాణ సమాజంవిరోచిత పోరాటం చేసిందని మోదీ గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ తెలంగాణ ప్రజలను దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్రాన్ని తాన ఎటిఎంగా మార్చుకుందని విమర్శించారు. తెలంగాణ డబ్బు ఇప్పుడు ఢిల్లీ చేరుతోందని, ఒక దోపిడీదారు మరో దోపిడిదారుపై పోరాడలేరని ప్రజలకు తెలుసన్నారు. బిఆర్‌ఎస్ దోపిడీలపై కాంగ్రెస్ మౌనం వహిస్తోందని కాంగ్రెస్ బిఆర్‌ఎస్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పని అయిపోతుందని ప్రధాని జోస్యం చెప్పారు. తెలంగాణ కలలను కాంగ్రెస్ బిఆర్‌ఎస్‌లు నాశనం చేశాయని ఆరోపించారు. ముఖ్యంగా ప్రజల భావోద్వేగాలతో బిఆర్‌ఎస్ చెలగాటం ఆడిందని, అధికారంలోకి రాకముందు అనేక మాటలు మాట్లాడిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం సహా దేనిపై కూడా విచారణ చేయడంలేదని విమర్శించారు. రూ.6,400 కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్దరించామని, పసుపు రైతులను బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కానీ బిజెపి ప్రభుత్వం పసుపు ధరను క్వింటాల్‌కు రూ.6 వేల నుంచి రూ.30 వేలకు పెంచామని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వాలు నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించలేకపోయాయని, మళ్లీ అధికారంలోకి రాగానే వచ్చే పదేళ్ల తెలంగాణ ప్రగతిపై ఫోకస్ చేస్తామని మోదీ చెప్పారు. తెలంగాణలో రైలు, రోడ్డు మార్గాలను అభివృద్ధి చేస్తామని, తెలంగాణలో బిజెపి ప్రభంజనంలో కాంగ్రెస్ బిఆర్‌ఎస్ కొట్టుకుపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు అధికారం కాపాడుకోవడం కంటే ప్రజల శ్రేయస్సు కోసం నిర్ణయాలు తీసుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు. తెలంగాణలో బిజెపి అధికారంలో ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందేదని, కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల అవినీతిపై కేంద్రం విచారణ చేపడితే మోదీని తిట్టడం ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌పై ప్రజలకు ఉన్న ఆగ్రహం బయటపడిందని చెబుతూ, తెలంగాణను దోచుకున్న వారిని తాము విడిచిపెట్టేదిలేదని తేల్చి చెప్పారు. దేశంలో దోపిడీని పరిశీలించినా దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయని చెబుతూ 2జి స్పెక్ట్రమ్ కేసులో డిఎంకె పేరు బయటకు వచ్చిందని, అది కుటుంబ పార్టీ, ఇప్పుడు కుటుంబ పార్టీ జాబితాలో బిఆర్‌ఎస్ చేరిందని మోదీ తెలిపారు. కుటుంబ పార్టీ అయిన బిఆర్‌ఎస్ కాళేశ్వరంలో అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ విషయంలోనూ బిఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు అవినీతికి పాల్పడ్డారని, కేవలం ఆరెండు పార్టీలు బిజెపిని, మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీల తీరుపై మోదీ ధ్వజమెత్తారు. తెలంగాణను దోచుకున్నవారిని ఎవరినీ వదలమని మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, బండి సంజయ్‌కుమార్, ధర్మపురి అరవింద్, పెద్దపల్లి బజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్, నాయకులు ఎస్.కుమార్, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బొడిగె శోభ, పైడిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## అధికారులపై ఇసి కొరడా

(మొదటి పేజీ తరువాయి)

రాజీవ్ కుమార్‌తోపాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు సోమవారం సమావేశమై ఈ నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 2019 లోక్‌సభ, 2016 అసెంబ్లీ ఎన్నికల్లో విధుల నుంచి కూడా ప్రస్తుతం ఉన్న పశ్చిమ బెంగాల్ డిజిపిని తొలగించినట్లు వర్గాలు పేర్కొన్నాయి. కాగా, రాజీవ్ కుమార్‌ను ఎన్నికల విధులు లేని పోస్టులో నియమించాలని, ఆయనకన్నా జూనియర్‌ను డిజిపిగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. డిజిపిగా ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను పంపాలని రాష్ట్రాన్ని కోరింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హోం కార్యదర్శులు ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రి కార్యాలయాల్లో రెండు చోట్లా నిర్వహిస్తున్నారని తేలినందున వారిని తొలగించారు. పోల్ ప్యానెల్ సాధారణంగా పార్లమెంటరీ మరియు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాల సమస్య దృష్ట్యా ఇలాంటి చర్య తీసుకుంటుంది. ఎన్నికలకు ముందు ఇసి ఎన్నికలకు సంబంధించిన పనులతో సంబంధం ఉన్న, మూడేళ్లు పూర్తి చేసుకున్న లేదా వారి సొంత జిల్లాల్లో ఉన్న అధికారులను బదిలీ చేయాలని ఎల్లప్పుడూ రాష్ట్రాలను ఆదేశిస్తుంది. అటువంటి అధికారులను రాష్ట్రాలు బదిలీ చేయకపోతే, వారిని తొలగించాలని ఇసి ఆదేశిస్తుంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలోని పోల్ ప్యానెల్ బృహన్‌ముంబయి మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ చాహల్, అదనపు కమిషనర్లు మరియు డిప్యూటీ కమిషనర్లను తొలగించాలని ఆదేశించింది. కొంతమంది మునిసిపల్ కమిషనర్లు, మరికొందరు అదనపు, డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లకు సంబంధించిన అధికారులను బదిలీ చేయాలనే ఆదేశాలను మహారాష్ట్ర పాటించలేదు. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సిఇసి సోమవారం సాయంత్రం 6 గంటలలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బిఎంసి, అదనపు, డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేయాలని కమిషన్ ఆదేశించింది. అలాగే మహారాష్ట్రలోని ఇతర కార్పొరేషన్ల మునిసిపల్ కమిషనర్లు, అదనపు లేదా డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేయాలని కూడా చీఫ్ సెక్రటరీని ఆదేశించారు.

బెంగాల్ కొత్త డీజీపీగా వివేక్ సహాయ్

కోల్‌కతా : కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సూచనల మేరకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సోమవారం రాష్ట్ర కొత్త డీజీపీగా వివేక్ సహాయ్‌ను నియమించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) గా ఉన్న రాజీవ్ కుమార్‌ను ఈసీ తొలగించిన కొద్ది గంటల్లోనే ఈ నియామకం జరిగింది. సహాయ్, 1988బ్యాచ్ ఐపీఎస్ అధికారి, సహాయ, డైరెక్టర్ జనరల్, కమాండెంట్ జనరల్ (హోం గార్డ్స్). గత డిసెంబరులో రాష్ట్ర డీజీపీగా నియమితులైన రాజీవ్ కుమార్‌ను ఎన్నికలతో సంబంధం లేని ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ విభాగానికి మార్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

## తమిళిసై రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఉదయం 11 గంటలకు అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాఘవేంద్ర సింగ్ చౌహాన్ ఆమెతో రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండవ గవర్నర్‌గా తమిళిసై బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రమాణ స్వీ కార కార్యక్రమానికి అప్పటి సిఎం కెసిఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. తమిళనాడు ప్రభుత్వం తరఫున ఆ రాష్ట్రానికి చెందిన అప్పటి ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం 2021 ఫిబ్రవరి 18వ తేదీ నుంచి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వహించారు.

**చెన్నై సెంట్రల్ నుంచి బరిలోకి తమిళిసై..**

గతంలో తమిళనాడు బిజెపి అధ్యక్షురాలిగా పని చేసిన తమిళిసై, 2019 ఎన్నికల్లో తూత్తుకుడి నుంచి లోక్‌సభకు పోటీ చేసిన కరుణానిధి కుమార్తె కణిమొళిపై ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై సౌందరరాజన్ మళ్లీ పోటీ చేస్తారని ఎప్పటి నుంచో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ సోమవారం ఉదయం గవర్నర్ ప దవికి తమిళిసై రాజీనామా చేశారు. తమిళనాడులోని చెన్నై సెంట్రల్ లేదా తూత్తుకుడి నుంచి బిజెపి లోక్‌సభ అభ్యర్థిగా తమిళిసై సౌందరరాజన్ పోటీ చేస్తారని తెలుస్తోంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు తమిళిసై చెన్నై వెళ్లారు.

**నేను ఎప్పటికీ మీ సోదరినే**

'నేను ఎప్పటికీ మీ సోదరినే, తెలంగాణను వదిలి వెళుతున్నందుకు చాలా బాధగా ఉంది, ఈ ప్రాంత ప్రజలను ఎన్నటికీ మరువను' అని తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన అంశంపై ఆమె తాజాగా స్పందించారు. 'నేను తెలంగాణ గవర్నర్ పదవి నుంచి వైదొలగుతున్నప్పుడు, అనేక భావోద్వేగాలతో మునిగిపోయాను. ఈ అద్భుతమైన రాష్ట్రానికి సేవ చేయడం చాలా ఆనందం కలిగించింది. అన్నింటికీ మించి తెలంగాణలోని సోదర సోదరీమణుల ఆప్యాయత నన్ను బాగా ఆకట్టుకుంది. నేను పదవీబాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ ప్రజలు నన్ను వారి అక్కగా అదరించారు. మీ అచంచలమైన మద్దతు, ప్రేమ, ఆప్యాయత ఎంతగా నాహృదయాన్ని తాకాయో నేను మాటల్లో పూర్తిగా వ్యక్తపరచలేకపోతున్నాను. మీతో పంచుకున్న ప్రతి క్షణం నాపై చెరగని ముద్రవేసింది. అందరం కలిసి తెలంగాణ అభివృద్ధికి, ప్రగతికి పాటు పడ్డాం. బోనాలు, బతుకమ్మ తదితర పండుగలు నిర్వహించుకున్నాం. మీ అచంచలమైన మద్దతు, సహృదయత నాకు నిరంతరం స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. నేను గవర్నర్ పదవికీ వీడ్కోలు పలుకుతున్న సందర్భంగా మీలో ప్రతి ఒక్కరికీ నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. మీ అచంచల మద్దతు నన్ను మీ సొంత అక్కగా ఆదరించినందుకు ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల పట్ల నా ప్రేమ చిరస్థాయిగా ఉంటుంది. మన అద్భుతమైన ప్రయాణం, చరస్మరణీయ జ్ఞాపకాలతో నిండిన హృదయంతో నేను తెలంగాణ వీడుతున్నాను. కృతజ్ఞతలు, హృదయపూర్వక నమస్కారాలు' అని తమిళిసై సౌందరరాజన్ తెలిపారు.

# కవిత స్క్వాష్ పిటిషన్ (మొదటి పేజీ తరువాయి)

కుంభకోణానికి పాల్పడ్డారని ఇడి ఆరోపించింది. ఢిల్లీ మద్యం కేసులో ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో కవితను ఆమె నివాసంలోనే అరెస్టు చేసిన అధికారులు ఢిల్లీకి తరలించారు. అనంతరం, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (ఎంపిఎల్‌ఎ) కోర్టు ఆమెను ఈనెల 23వ తేదీ వరకూ ఇడి కస్టడీకి అనుమతించింది. ఇలావుంటే, ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీశ్ సిసోడియా వంటి ఆ పార్టీ కీలక నేతలతో కలిసి కుట్రకు పాల్పడ్డారని ప్రాథమిక దర్యాప్తులో స్పష్టమైనట్టు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇడి స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వం 2021—22లో తీసుకొచ్చిన మద్యం పాలసీని, సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో రద్దు చేశారు. కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు రావడంతో, సిబిఐ దర్యాప్తుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా సిఫార్సు చేశారు. అనంతరం మనీ లాండరింగ్ చోటు చేసుకుందన్న సమాచారంతో ఇడి కూడా కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆప్ సీనియర్ నాయకులు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌సహా మొత్తం 15 మందిని ఇడి అరెస్టు చేసింది. వారిలో కొంతమంది వ్యాపారస్థులు కూడా ఉన్నారు. అనుమానితుల జాబితాలో కవిత కూడా ఉన్నట్టు ఇడి తాజా ప్రకటనలో పేర్కొంది. కొంతమంది డీలర్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడానికిగాను వంద కోట్ల రూపాయల మేరకు ముడుపులను ఆప్ నేతలకు కవిత, ఆమె సన్నిహితులు అందచేశారని ఇడి వివరించింది. ఈనెల 15వ తేదీన కవిత ఇంటిని సోదా చేయడానికి వెళితే, అక్కడ అధికారులను ఆమె బంధువులు అడ్డుకున్నారని ప్రకటించింది. విచారణ కొనసాగుతున్నదని పేర్కొంది. ఆమెను అడిగిన ప్రశ్నలు గురించిగానీ, ఆమె ఏవైనా వివరాలు ఇచ్చారా అనే అంశంపైగానీ ఇడి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

## వక్రీకరించారు (మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. తన మాటలను వక్రీకరించడం, లేని అర్థాలు ఆపాదించడం ప్రధానికి అలవాటేనని వ్యాఖ్యానించారు. తాను 'అసుర శక్తి', 'దైవిక శక్తి' మధ్య పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నానని వివరించారు. కానీ, తన మాటలను వక్రీకరించడం ద్వారా, మత విశ్వాసాలను రెచ్చగొట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మరోసారి అధికారంలోకి రావడం కోసం మోడీ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని తేల్చిచెప్పారు.

## కఠిన చర్యలు (మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగిసిన తర్వాత 3, 4 రోజుల్లో హోమ్ ఓటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కోసం ఈసారి 48 వేల వివి ప్యాట్‌లు అవసరమని, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికకు 500 ఇవిఎంలు, 500 వివి ప్యాట్‌లు అవసరమవుతాయని వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో 1.8 లక్షల మంది సిబ్బంది అవసరమని, అదనంగా మరో 25 వేల మంది సిబ్బంది కూడా అవసరమవుతారన్నారు. 40 వేల మంది బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు పని చేస్తారన్నారు. పోలింగ్ విధుల్లో 145 కేంద్ర బలగాలు, 60 వేల మంది పోలీసు సిబ్బంది, 1920 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఉంటాయని వివరించారు. ఇటీవల పలు కార్పొరేషన్ల ఛైర్మన్ల నియామక అంశాపై ఆరా తీస్తామని వెల్లడించారు.

**ఎన్నికల నియమావళి అమలుపై నిఘా**

ఎన్నికల నియమావళి అమలుపై గట్టి నిఘా ఏర్పాట్లు చేశామని, సరిహద్దుల వద్ద 24 గంటలు పని చేసేలా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు వికాస్ రాజ్ తెలిపారు. సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సివిజిల్ యాప్ లేదా 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఎన్నికల ప్రచారంలో పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం చేయరాదని హెచ్చరించారు. సుమారు లక్షన్నర మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని, 71 వేల 968 ఈవీఎంలను వినియోగించనున్నట్లు తెలిపారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన సుమారు 5 వేల కేంద్రాలను గుర్తించామని, అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టి, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సివిజిల్ యాప్ లేదా 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

## ఎన్నికల వేళ హైఅలర్ట్ (మొదటి పేజీ తరువాయి)

అత్యాధునిక బేస్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఉపయోగించే స్వరంగ మార్గం ఒకటి బయటపడింది. మరో పక్క హిడ్మా స్వగ్రామమైన పూంవర్తిలో అతని తల్లిని కలిసిన భద్రతా బలగాలు ఆమెతో ఫొటో దిగి ఆ గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేసిన విషయం విధితమే. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు కావడం, కేంద్రంలోని బిజెపి సర్కార్ మావోయిస్టుల ఏరివేతకు ఆపరేషన్ ప్రహార్ కొనసాగిస్తున్న వేళ... మావోయిస్టులు అదునుకోసం ఎదురు చూస్తున్నట్లు అంతా భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఆనుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రాలు గొలుసుకట్టుగా ఉండటంతో మావోయిస్టులు సులువుగా వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. గడచిన నెల రోజులుగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. తాజాగా మూడు రోజుల క్రితం ఇంద్రావతి నదీ సమీపంలో మావోయిస్టులు, పోలీసులకు ఎదురుకాల్పులు చోటు చేకున్నాయి. అంతకంటే నాలుగు రోజుల ముందు జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక జవాన్, ఒక మావోయిస్టు చనిపోయారు. దీంతో ఆయా ప్రాంతాలపై కేంద్ర భద్రతా బలగాలతో పాటు ఆయా రాష్ట్ర పోలీసులు బాస్‌లు గట్టి నిఘా పెంచారు. వాహనాల రాకపోకలపై కన్నేశారు. గోదావరి ఫెర్రీపాయింట్లు, అంతర్రాష్ట్ర రహదారులపై భద్రత పెంచారు. అడవుల్లో నుండి వచ్చే కాలిబాటలపై డేగ కన్నేశారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘా పెంచుతున్నారు. కోబ్రా, సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి బలగాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అడవులను జల్లెడ పడుతున్న వారు మావోయిస్టుల ఏరివేతక రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరికొన్ని బలగాలను అడవుల్లోనికి పంపి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, వారికి సహకరించే గ్రామాలు, ప్రజలపై ఆరా తీసి అదుపుచేసేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

త్వరలో అంతర్రాష్ట్ర సమావేశం

సార్వత్రిక ఎన్నికలు, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా త్వరలో నాలుగు రాష్ట్రాల పోలీసుల అంతర్రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించనున్నారు. ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐటిసి పిఎస్‌పిడిలో అంతర్రాష్ట్ర పోలీసుల సమావేశం జరిగింది. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరోసారి అంతర్రాష్ట్ర పోలీసుబాసులు, కేంద్ర భద్రతా సలహాదారుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలలో చోటు చేసుకోకుండా ఎన్నికల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రచించాల్సిన వ్యూహాలు, భద్రత తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# కె.శ్రీనివాస్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు





(మొదటి పేజీ తరువాయి)

పట్టు సాధించాలని, 'నాది అనే భావన'తో సిబ్బంది పత్రిక అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ, శ్రీనివాస్ రెడ్డి, మక్కెన సుబ్బారావులకు అభినందనలు తెలియజేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె నరసింహ్మ 'ప్రజాపక్షం' గురించి పాట ఆలపించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రజాపక్షం దినపత్రిక ఎగ్జికూటివ్ ఎడిటర్‌గా బొమ్మగాని కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్‌గా బి.లక్ష్మీ నారాయణ, న్యూస్ ఎడిటర్‌గా పి.శ్రీనివాస్ రెడ్డి నియమితులైనట్లు ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి ప్రకటించారు. పత్రిక జనరల్ మేనేజర్ (యాడ్స్) వి.మదన్, న్యూస్ నెట్‌వర్క్ చీఫ్ ఇ.చంద్రశేఖర్‌తోపాటు వివిధ జిల్లాలకు చెందిన రిపోర్టర్లు, నవచేతన విజ్ఞాన సమితి సిబ్బంది హాజరయ్యారు. ప్రకాశం జిల్లావాసి ఎం.సుబ్బారావు 1966 అక్టోబరులో విశాలాంధ్ర దిపత్రికలో ట్రైనీ సబ్ ఎడిటర్‌గా చేరారు. 70వ దశకంలో ఐదేళ్ళపాటు హైదరాబాద్‌లో విశాలాంధ్ర ముఖ్య విలేకరిగా పనిచేశారు. ఆ తదుపరి న్యూస్ ఎడిటర్‌గా 20 సంవత్సరాలు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా, లీడ్ రైటర్‌గా, అసోసియేట్ ఎడిటర్‌గా తదితర హోదాల్లో 50 ఏళ్ళు 'విశాలాంధ్ర' ప్రస్థానంలో ఆయన పాత్రికేయ జీవితం మమేకమైంది. 'మన తెలంగాణ', 'ప్రజాపక్షం' పత్రికల్లో అసోసియేట్ ఎడిటర్‌గా 2023 వరకూ ఆరు సంవత్సరాలు ఆయన పనిచేశారు.

## తనిఖీల్లో పట్టుబడ్డ రూ.5.73కోట్ల విలువైన బంగారం

జిల్లా ఎస్‌పి చందనా దీప్తి

**ప్రజాపక్షం/నల్లగొండ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం, ఓటర్లను ప్రలోభ పెట్టే నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాకు చెక్ పెట్టడానికి జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి నిఘా పెడుతూ ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం మిర్యాలగూడ పట్టణములోని ఈదుల గూడ చౌరస్తా వద్ద డిఎస్‌పి మిర్యాలగూడ రాజశేఖర రాజు ఆధ్వర్యములో ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసు జి.సుధాకర్, మిర్యాలగూడ1 టౌన్, బి.శ్రీనివాస్, సబ్‌ఇన్స్‌పెక్టర్ మిర్యాలగూడ 1 టౌన్‌ల సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ టౌన్ నుంచి కోదాడ వైపు వెళ్తున్న టిఎస్09యుఇ2479 నెంబరు కలిగిన బోలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహనములో రూ.5.73కోట్ల విలువ గల బంగారంను రవాణా చేస్తున్నట్లు గమనించి ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేర కు ఇట్టి వాహనమును, ముగ్గురు వ్యక్తులను బంగారముతో సహా స్వాధీనములోనికి తీసుకుని విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల ధర్నా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని ప్రభుత్వమెడికల్ కాలేజీ విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ముందు ధర్నా నిర్వహించిన విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీలో సదుపాయాలు సరిగా లేవని, మంచినీరు, వసతి, భోజన సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. ప్రిన్సిపల్ డ్రెస్‌గోడ్ విషయంలో హేళన చేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో మెడికల్ విద్యార్థులపై ప్రిన్సిపల్ కోపాన్ని చేస్తున్నారని, తమకు సౌకర్యాలు కల్పించాలని అడుతున్నప్పటికీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు మం డిపడ్డారు. ప్రిన్సిపల్ లక్ష్మ ణరావు తమకు వద్దని, వెంటనే ప్రిన్సిపల్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోని, తమ మెడికల్ కళాశాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

## చండూరు గగన్ మల్టిస్పెషాలిటి హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి ఆపరేషన్

50 సంవత్సరాల మహిళకు విజయవంతంగా శస్త్ర చికిత్స




**ప్రజాపక్షం/చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో ఉన్న గగన్ మల్టి స్పెషాలిటి హాస్పిటల్‌లో 50 సంవవ్సరాల వయస్సు గల మహిళకు మోకాలి మార్పిడి ఆపరేషన్‌ను సోమవారం విజయవంతం చేసి చూపించారు గగన్ హాస్పిటల్ డాక్టర్ల వైద్య బృందం. గ్రామీణ మారుమూల ప్రాతంలో ఉన్న చండూరులో ఇలాంటి అరుదైన చికిత్సలు చేయడం ఇదే మొదటిసారి. గగన్ హాస్పిటల్‌లోని డాక్టర్ మల్లికార్జున్ ఆర్థోపెడిక్ ,డాక్టర్ ఉమామహేశ్వర్ ఆర్థోపెడిక్, డాక్టర్ నవీన్ కుమార్ అనస్తీసియాతో కూడిన నిపుణులైన వైద్యబృందం మోకాలి మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వారిలో ఉన్నారు. ఇలాంటి ఆపరేషన్ చండూరు పట్టణంలో విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చండూరు పరిసర ప్రాంత ప్రజలు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిన గగన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నారు. చండూరులోని గగన్ మల్టి స్పెషాలిటి ఆస్పిటల్‌లో అతి తక్కువ వైద్యం ఖర్చులతో మెరుగైన వైధ్యాన్ని అందిస్తున్నట్లు ఇలాంటి అవకాశాలను చండూరు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని గగన్ మల్టి స్పెషాలిటి హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.

**మోకాళ్ల ఆపరేషన్‌తో నొప్పుల ఉపశమనం : డాక్టర్ మల్లిఖార్జున్**

మోకాళ్ళ నొప్పులతో తీవ్రమైన ఇబ్బందులు పడుతు నడువలేక పోతున్న ప్రజలకు మోకాళ్ల మార్పిడి ఆపరేషన్ వలన ఎంతో ఉపశమనం పొందుతారని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ టి. మల్లికార్జున్ తెలిపారు. ఇలాంటి ఆపరేషన్‌లు గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందాలనే దృక్పదంతో గ్రామీణ మారుమూల ప్రాంతమైన చండూరులోని గగన్ మల్టి స్పెషాలిటి ఆస్పిటల్ నందు మెకాళ్ల మార్పిడి ఆపరేషన్‌ను చండూరులో అందుబాటులో ఉంచామని ఈ అవకాశాలను చండూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ టి. మల్లిఖార్జున్ సూచించారు.


## దానం నాగేందర్‌పైన అనర్హత వేటు వేయాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుప్రీం తీర్పుతో ఎంఎల్‌ఎల అనర్హత వేటు అంశంలో ఇది వరకు స్పీకర్లు జాప్యం చేసే పరిస్థితులు లేవని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎంఎల్‌ఎ దానం నా గేందర్‌పైన స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిమ మల్టిప్లెక్స్‌లో దొరికిన డబ్బుకు వారే లెక్కలు చెప్పుకుంటారని, వారు తనకు బంధువులు అయినంత మాత్రాన తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తారా అని ప్రశ్నించారు.

**దానంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల బృందం**

కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌పైన అనర్హత వేటు వేయాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల బృందం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరింది. ఈ మేరకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు పాడికౌశిక్ రెడ్డి, ముఠాగోపాల్, కాలే రు వెంకటేష్‌తో పాటు పలువురు ప్రతినిధుల బృందం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ మారిన ఎంఎల్‌ఎలపై అనర్హత వేటు వేసే నిర్ణయాన్ని మూడు నెలల్లో తీసుకోవాలని సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చిందన్నారు. తాము గేట్లు తెరిస్తే 'మీరు' భూ స్థాపితం అవుతారని హెచ్చరించారు. ఏ రాజకీయ పార్టీ కూడా వలసలను ప్రోత్సహించడం సబబు కాదన్నారు.



# దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం






ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, భగత్ సింగ్ స్ఫూర్తి తో యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం ఏర్పాటు చేసి న భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిధిగా హాజరై, ప్రసంగిస్తూ క్రీడలు శరీర ఎదుగుదలకు,మానసిక స్థైర్య పెంపుదలకు ఉపయోగపడుతుందన్నారు. భగత్ సింగ్‌కు మన దేశం ఏం చేసిందని ఆలోచించకుండా, దేశానికి భగత్ సింగ్ చేసిన నిస్వా ర్థం సేవలను గుర్తించాలని, తద్వారా భగత్ సింగ్ అడుగుజాడల్లో నేటి యువత నడిస్తే సామాజిక స్పృహ అలవర్చుకోవచ్చని ఉద్ఘాటించారు. నేటి పాలకులు భగత్ సింగ్ చరిత్రను వక్రీకరించి గోబెల్స్ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారని, ఈ గోబెల్స్ ప్రచారాన్ని సైద్ధాంతిక అవగాహన కల్గిన నేటి యువత తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పాలకులు క్రీడారంగాన్ని విస్మరిస్తున్నారని, క్రీడలకు నిధులను మంజూరు చేయడం లేదని విమర్శించారు. గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడాకారులను గుర్తించి వారికి అన్ని రకాల సహకారం, గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఎఐ ఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి గ్యారా నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు చెట్టుకింద శ్రీనివాస్, ఎఐవైఎఫ్ నేతలు మాజీద్, కళ్యాణ్, అనిల్, మహేష్, లతో పాటు పది జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాహుల్ మాటలు వక్రీకరించడం ఎన్నికల నియమావళికి విరుద్ధం

టిపిసిసి సీనియర్ ఉపాధ్యాక్షుడు జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హిందూ మతంలోని శక్తి అనే పదం ఉంది, మేము ఆ శక్తితో పోరాడుతున్నామని రాహుల్ గాంధీ చెప్పడం జరిగిందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యాక్షుడు జి.నిరంజన్ అన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను వక్రీకరించి, దుష్ప్రచారం చేయడం దేశంలో అమలులో ఉన్న ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. ఈ మేరకు మోడీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతూ ఒక లేఖ రాయడం జరిగిందన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ముంబాయి సభలో ఆదివారం ఇవిఎం, ఇడి, సిబిఐల వెనుక ఉన్న శక్తులతో పోరాడుతున్నామని స్పష్టంగా చెప్పడంలో తప్పేముంది నిరంజన్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ తన పదవి ఔనత్యాన్ని మరిచి, రాహుల్ గాంధీ మాటలను వక్రీకరించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. అమ్మవారిని శక్తి స్వ రూపిణిగా తామే పూజిస్తున్నట్టు, దేశంలోని తల్లులను, సోదరీమణులను తామే గౌరవిస్తున్నట్టు ఇతరులపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బిఆర్‌ఎస్‌లో చేరిన ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయాల్లో అనేక కష్టాలు వస్తాయని, వాటిని తట్టుకుని నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు సాగాలని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. పాలకులపైన ఐక మత్యంతో పోరాటం చేసి హక్కులను సాధించుకోవాలన్నారు. ఇటీవల బిఎస్‌పికి రాజీనామా చేసిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ కెసిఆర్ సమక్షంలో ఎర్రవల్లిలో వ్యవసాయ క్షేత్రంలో సోమవారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు పలువురు బిఎస్‌పి నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ దళిత బంధు పథకంతో మనకు దెబ్బపడిందని అంటున్నారని, అటువంటి ఆలోచన సరికాదన్నారు. దళితబంధు పొందినకుటుంబాలు బాగుపడ్డాయని, దళిత సమాజం దీనిని పాజిటివ్‌గా ఎందుకు తీసుకోలేకపోయిందో బహుజన యువ మేథావులు విశ్లేషించాలని సూ చించారు. బహుజన సిద్ధాంతంపైన లోతుగా చర్చ జరగాలని, స్పష్టమైన అవగాహన వచ్చే వరకు విపరీతమైన మేథోమథనం జరగాలన్నారు. అంతకుముందు ప్రవీన్ కుమార్ హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బిఆర్‌ఎస్ నేతలతో సమావేశమయ్యా రు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ తా ను ఒక ప్రత్యేక పరిస్థితుల్లో, బలమైన తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించాలన్న యజ్ఞంలో భాగస్వామ్యం కావాలనే తాను బిఆర్‌ఎస్‌లో చేరుతున్నానని అన్నారు. తెలంగాణ వాదం, బహుజన వాదం ఒక్కటేనని చెప్పారు. కెసిఆర్ కల్పించిన వేదిక ద్వా రా లక్ష్య సాధన కోసం ప్రయత్నిస్తానన్నారు. సిఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు తాను టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ పదవిని తిరస్కరించిన మాట వాస్తవమేనని, అయితే రేవంత్ రెడ్డి ఒక వైపు తనను పొగుడుతూనే మరోవైపు సుతిమెత్తగా హెచ్చరిస్తున్నారన్నారు. ఏ వేదికపైన పని చేయాలన్న స్వేచ్ఛ తమకు లేదా? అని ఆయ న ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే గొర్రెల మందలో తాను ఒక్కరు కాలేనని అన్నారు. తాను ఏ ప్యాకేజీ తీసుకోలేదని, ప్యాకేజీ తీసకునేవాడినైతే అధికార పార్టీలో చేరేవాడినని తెలిపారు. తనకు గతంలో కెసిఆర్ ఇచ్చన అవకాశంతోనే గు రుకుల సంస్థల కార్యదర్శిగా గురుకుల పాఠశాలలో పది లక్ష ల మంది విద్యార్థలను ప్రయోజకులను చేశానన్నారు. కెసిఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , జి.జగదీశ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## కృష్ణానది నుండి తెలంగాణకు దక్కాల్సిన వాట దక్కడం లేదు

మాజీ మంత్రి డి.కె. సమరసింహ్మా రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వాళ్ళు ఎక్కువనీళ్లు వాడుకుంటున్నారని కేంద్ర జలవనరుల శాఖ చెప్పడం బాధాకరమని మాజీ మంత్రి డి.కె. సమరసింహ రెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణానది నుండి తెలంగాణ దక్కాల్సిన వాట దక్కడం లేదన్నారు. 800 టిఎంసిలలో తెలంగాణకు 64 శాతం వాటా రావాల్సి ఉందన్నారు. తమమ జిల్లా వాడే సిఎం, పార్టీ ప్రెసిడెంట్ అని, 100 రోజుల్లో చెయ్యాల్సిన దానికంటే ఎక్కువనే చేశాడని అభినందించారు. చెప్పిన గ్యారంటీలన్నీ చేస్తున్నాడన్నారు. కృష్ణా నీటి అంశం కూడా తేల్చాలన్నారు. 1990లో తాను రెవెన్యూ మంత్రిగా 29 మందిని సస్పెండ్ చెయ్యాల్సి వచ్చిందన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తిచేయాలని కోరారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యాక్షుడు ఎం. కోదండరెడ్డి మాట్లాడుతూ కృష్ణా రివర్ బోర్డు తెలంగాణ కావాల్సినదానికంటే ఎక్కువగా వాడుకుంటుందని చెప్పడం దారుణమన్నారు. మొట్టమొదటి బచావత్ ట్రిబ్యునల్ న్యాయంగా నీళ్లను పంపకం చేసిందన్నారు. కానీ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వచ్చాకా అన్ని ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. తెలంగాణకు అన్యాయం చేస్తూ పక్క రాష్ట్రాలకు ఎక్కువగా కేటాయింపులు జరిగాయని విమర్శించారు. కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు తామంతా పోరాటం చేశామని తెలిపారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సరిచేయాలని కోరామన్నారు. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ మూడు ప్రాంతాలకు అన్యాయం జరగకుండా చూడాలని అప్పట్లో కోరామని చెప్పారు. ఐతే 2014 నుండి నీటికేటాయింపులు మరింత దారుణంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా రివర్ మహబూబ్ నగర్ జిల్లాలో ఎక్కువగా ప్రవహిస్తున్నా నీటి కష్టాలు తప్పడం లేదన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సవరించాలని కోరారు. కృష్ణా రివర్ పరివాహ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చెయ్యాలని కోదండ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బిఆర్‌ఎస్, బిజెపి కుట్రలు చూస్తూ ఊరుకోవాలా?

పార్టీ ఫిరాయింపులపై బిఆర్‌ఎస్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది

పరిగి ఎంఎల్‌ఎ రామ్మోహన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపులపై బిఆర్‌ఎస్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పరిగి నియోజకవర్గం కాంగ్రెస్ ఎంఎల్‌ఎ రామ్మోహన్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్, బిజెపి కుట్రలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. 10 ఏళ్ళ పాటు విచ్చల విడిగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్, బిజెపి కుట్రలకు బలి కావడానికి రేవంత్ రెడ్డి చేతకాని వాడు కాదన్నారు. దెబ్బకు దెబ్బ తీస్తామని హెచ్చరించారు. తమ ప్రభుత్వాన్ని ఐదేళ్లు ఎలా కొనసాగించాలో తమకు తెలుసు అన్నారు. కాంగ్రెస్, టిడిపి, బిఎస్‌పి చివరకు సిపిఐ ఎంఎల్‌ఎలను ప్రలోభ పెట్టి మీ పార్టీలో చేర్చుకోలేదా అని బిఆర్‌ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణ పునర్ నిర్మాణం పేరుతో శాసనసభ్యులను చేర్చుకున్నది మీరు కాదా అన్నారు. పదేళ్లలో ఇతర పార్టీల నుంచి మొత్తం 39 మంది ప్రతిపక్ష ఎంఎల్‌ఎలను బిఆర్‌ఎస్ చేర్చుకున్నారని తెలిపారు. 2014లో 23 మంది ప్రతిపక్ష ఎంఎల్‌ఎలను బిఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారన్నారు. ఇందులో టిడిపి నుంచి 12 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, వైసిపి నుంచి ముగ్గురు, బిఎస్‌పి నుంచి ఇద్దరు, సిపిఐ నుంచి ఒకరిని చేర్చుకున్నారని గుర్తు చేశారు. 2018లో 16 మందిని చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి 12 మంది, తెలుగు దేశం నుంచి ఇద్దరు, ఇద్దరు స్వతంత్రులను చేరుకున్నారని వివరించారు. కెటిఆర్, హరీశ్ రావు ప్రతిపక్ష ఎంఎల్‌ఎల ఇళ్ల చుట్టూ తిరిగి ప్రలోభపెట్టింది మరిచిపోయారా అన్నారు. టిడిపి నుంచి బిఆర్‌ఎస్‌లో చేరిన ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో రాజీనామా చేయించకుండా మంత్రి వర్గంలోకి తీసుకోలేదా అన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోలేదా అన్నారు. అప్పటి స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి అనర్హత పిటిషన్‌లపై చర్యలు తీసుకున్నారా అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఫిర్యాదులపైన ఒక్కసారి కూడా కనీసం విచారణ కూడా చేయలేదన్నారు. ప్రతిపక్ష ఎంఎల్‌ఎలను చేర్చుకోవాలని తమ సిఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ భావించలేదన్నారు. 100 రోజుల పాటు మేం ఆ ఆలోచన కూడా చేయలేదన్నారు. ప్రతిపక్ష ఎంఎల్‌ఎలకు గౌరవం ఇచ్చామని, తమ ముఖ్యమంత్రి వారికి అపాయింట్ మెంట్ ఇచ్చి సమస్యలు తెలుసుకున్నారన్నారు. ప్రభుత్వాన్ని కూల్చడానికి బిఆర్‌ఎస్, బిజెపి కుట్రలు చేశాయన్నారు. ప్రమాణ స్వీకారానికి ముంది కడియం శ్రీహరి లాంటి వాడు ప్రభుత్వం కూలి పోతుందని అన్నారన్నారు. త్వరలో కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతాడని కెటిఆర్ అనలేదా అని ప్రశ్నించారు. మన ప్రభుత్వం ఆరు నెలల్లో వస్తుందని కెసిఆర్ ఎంఎల్‌ఎల సమావేశంలో చెప్పలేదా అన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ హితువు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ద్వారా రైతులకు రైతు వేదికలలో నుండి శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు సలహాలను విని వారి సమస్యలను నివృత్తి చేసుకునేందుకు 110 రైతు వేదికలలో వీడియోకాన్ సిస్టం ఏర్పాటు చే శామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి మంగళవారం ఈరైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుండి 11:30 వరకు నేరుగా వీక్షించే అవకాశం కల్పించామన్నా రు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు రైతు నే స్తం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపిం ది. ఈ వారం వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మె ళుకువలపై డాక్టర్ బి. శ్రీనివాస్ జగిత్యాల నుండి వారి సూచనలను రైతులకు అందజేస్తారు. తదుపరి ఆయిల్ ఫామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలను గురించి డాక్టర్ రాజశేఖర్, శ్రీ కొండా లక్ష్మ ణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ రైతుల కు సూచనలు సలహాలు ఇస్తారు. వేసవిలో సాగు చేసే కూరగాయలు, వాటిపై వాడే పురుగుమందు లు అవశేషాల గురించి రైతులకు వివరిస్తారు. ఈ కార్యక్రమం డాక్టర్ కె. కవిత రైతుల సందేహాలకు సమాధానం ఇస్తారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి పాల్గొంటారని, కావున రైతులు తమ తమ రైతు వేదికల నుండి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కోరింది.

**టిఎస్ జిఎల్ఐ పాలసీదారులగు ఉద్యోగులు, ఉపాధ్యాయులు**

## ప్రతిపాదన పత్రాలు సమర్పించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమా (టిఎస్ జిఎల్ఐ) పాలసీదారులగు ఉద్యోగులు, ఉపాధ్యాయులు బీమా అర్హత వయస్సు (56) సంవత్సరాల లోపు ఉండి వారి జీతభత్యాల నుండి నెలసరి బీమా ప్రీమియంలను క్రమం తప్పకుండా బీమా తగ్గించి, తదనుగుణంగా ప్రతిపాదన పత్రాలు సంబంధిత జిల్లా కార్యాలయాలకు సమర్పించి, తగిన విధంగా పాలసీలు పొందితే, వారు మాత్రమే బీమా ప్రయోజనాలకు అర్హులవుతారని టిఎస్ జిఎల్ఐ సంచాలకులు తెలిపారు. అయితే కొంతమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బీమా అర్హత వయస్సు (56) సంవత్సరాల లోపు ఉండి ప్రీమియంలు క్రమంతప్పకుండా తగ్గించుచున్నప్పటికీ, సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో ప్రతిపాదన పత్రాలు సమర్పించకపోవడంతో నేటికి పాలసీలు పొందియుండలేదన్నారు. అటువంటి వారు అన్ని రకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారన్నారు. అందువల్ల, వారు వారి డిడిఒలు తగిన చొరవ తీసుకొని వారి జీతభత్యాల నుండి మినహాయించే మొత్తం ప్రీమియంకు సరిపడే విధంగా పూరించిన ప్రతిపాదన పత్రాలను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో సమర్పించి, వాటికి తగిన విధంగా పాలసీలను పొంది, అట్టి పాలసీ నెంబర్లను సమగ్ర ఆర్థిక నిర్వహణ, సమాచార విధానం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్ నందలి ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్ డేట్ చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో వారి నెలసరి ప్రీమియం మొత్తాలు అనామతు ఖాతాలోకి వెళ్ళే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా అన్ని రకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారని స్పష్టం చేశారు. కావున ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బీమా ప్రయోజనాలను పూర్తి స్థాయిలో పొందవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా టెన్త్ వార్షిక పరీక్షలు ఆరంభం

జిల్లాలో 361 పరీక్షా కేంద్రాలు

99.55 శాతం విద్యార్థుల హాజరు నమోదు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** జిల్లా పరిధిలో తొలిరోజైన సోమవారం (మార్చి 18న) పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం గట్టి చర్యలు చేపట్టింది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటైంది. పరీక్షా కేంద్రాలలో సి.సి కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ను అమలు చేశారు. ఫలితంగా పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. హైదరాబాద్ జిల్లాలో 361 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 930గంటల నుంచి మధ్యాహ్నం 1230 గంటల వరకు పరీక్షలు జరిగాయి. విద్యార్థులు సకాలంలోనే పరీక్షలకు హాజరయైనట్లు సమాచారం. తెలుగు, హిందీ, కాంపోజిట్ తెలుగు, కాంపోజిట్ ఉర్దూ పరీక్షలు తొలి రోజున జరిగాయి. కాంపోజిట్ వారికి పరీక్ష ముగిసే సమయం 1250గంటల వరకు నిర్ధారించారు. పదవతరగతి పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులుగా పరీక్షలకు హాజరయ్యేందుకు 73,204మంది రిజిష్టర్ చేసుకున్నారు. కాగా తొలిరోజు పరీక్షలకు 72,877మంది హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 327 మంది పరీక్షలకు గైర్హాజరు కాగా, ప్రైవేట్ విద్యార్థులుగా నమోదైన వారు 181మంది గైర్హాజరు అయినట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. కాగా ఈ పరీక్షలకు అటెండెన్స్ 99.55శాతం నమోదైంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల హాజరు సకాలంలో జరిగిందని, ఎలాంటి ఆలస్యాలు చోటు చేసుకోలేదని హైదరాబాద్ జిల్లా డిఈవో రోహిణి తెలియజేశారు. కాగా జిల్లా పరిధిలో పరీక్షల నిర్వహణ తీరును హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిఈవో రోహిణి, ఇద్దరు అదనపు కలెక్టర్లు పర్యవేక్షించారు.
సోమవారం కలెక్టర్ అనుదీప్ ఖైరతాబాద్‌లోని నిర్మల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లేముందు కలెక్టర్ తన సెల్‌ఫోన్‌ను సెక్యూరిటీ పోలీసులకు అందజేసి లోనికి వెళ్లారు. పోలీసులు తనిఖీ చేసిన అనంతరం కలెక్టర్ పరీక్షా కేంద్రంలోకి వెళ్లి పరీక్షల నిర్వహణ సరళిని గమనించడం గమనార్హం. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, అత్యవసర మందులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనప్పటికీ తప్పని సరిగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రాలలోకి పంపించాలని, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వరకు జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

## జూన్7నుండి యథాతథంగా 'ప్రజావాణి'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోనికి వచ్చిన నేపథ్యంలో ప్రజాభవన్‌లో నిర్వహించే ''ప్రజావాణి'' కార్యక్రమానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జూన్7 నుండి తిరిగి యథాతథంగా 'ప్రజావాణి' కొనసాగుతుం దని ప్రజావాణి నోడల్ అధికారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాపక్షం

మంగళవారం, మార్చి 19

## నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు...

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు...నా యిచ్ఛయేగాక నాకేటి వెరపు..అని భావకవి చెప్పడంలో ఉద్దేశం ఏదైనాగానీ, రాజకీయాల్లో బిజెపి మాత్రం ఆ సిగ్గూ లజ్జా వదిలేసి బాహాటంగా అసత్యాలు వల్లెవేస్తున్నది. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి ఆ పార్టీకి వేలకోట్లు విరాళాలుగా కట్టబెట్టిన ''మహాదాత''ల పేర్ల గుట్టు రట్టు కావాల్సిందే అని సుప్రీంకోర్టు కరాఖండీగా చెప్పిన తర్వాత కూడా బిజెపి దొంగాటకాలు అనంతంగా సాగిపోతున్నాయి. దాతలపేర్లు తాము వెల్లడి చేయబోమని భారత ఎన్నికల సంఘానికి ఆ పార్టీ తెగేసి చెప్పేసింది. ఎన్నికల బాండ్ల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఫిబ్రవరి 16వ తేదీన ఇచ్చిన అత్యంత ప్రతిష్టాత్మకమైన తీర్పు దేశంలో సర్వత్రా చర్చనీయాంశమైన తర్వాత కూడా ఈ విషయంపై బిజెపి అధిష్టానం ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం నటిస్తున్నది. బిజెపి 'బలవంతపు వసూళ్ళ' గాథ ఈ లోక్‌సభ ఎన్నికల వేళ ఊరూవాడా చెప్పుకుని చీదరించుకుంటున్నాగానీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాకు చీమకుట్టినట్టు కూడా లేదు.''మీరు చెప్పింది నిజమే, 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 29 సి ప్రకారం ప్రతి రాజకీయపార్టీ తమకు విరాళాలు ఇచ్చిన దాతలపేర్లను రికార్డుల్లో ఉంచాల్సిందే, మీకు సమర్పించాల్సిందే, కానీ సవరించిన నిబంధనల ప్రకారం ఆ అవసరం లేదు!! రూ.20,000 కంటే ఎక్కువ ధనాన్ని విరాళంగా ఇచ్చిన వ్యక్తులు లేదా కంపెనీల పేర్లు మీకు చెప్పాల్సిన అవసరం లేదు'' అని భారత ఎన్నికల సంఘానికి కుండబద్దలు కొట్టిమరీ చెప్పేసి బిజెపి చేతులు దులిపేసుకున్నది. గడచిన సెప్టెంబరులోనే ఈ తంతంగం నడిచింది. ఇప్పటికీ బిజెపి ఆ వైఖరికే కట్టుబడి ఉండటం, దేశాన్ని పాలించే బాధ్యతగల జాతీయపార్టీ అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రజలకు దక్కాల్సిన ధనాన్ని ఎడాపెడా దోచేసిందని దేశం కోడైకూస్తున్నాగానీ ఇంకా...ఇంకా ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం క్షంతవ్యం కాదు.

ఎన్నికల బాండ్ల వివరాలు, దాతల పేర్లు డీకోడ్ చేసి అన్ని వివరాలు చెప్పాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చట్టపరమైన బాధ్యత ఉన్న మాట నిజమే. కానీ ఒక రాజకీయపార్టీగా బిజెపి కూడా తనకు తానుగా ప్రజలకు జవాబుదారీ వహించకపోవడం, ఏ మాత్రం పశ్చాత్తాపం లేకపోవడం లేదా ప్రజలకు కనీస వివరణ ఇవ్వడానికైనా సిద్ధపడకపోవడం కాషాయ కూటమి నిజస్వరూపాన్ని బయటపెడుతున్నది. వీలైనంత ఎక్కువ కాలం జాప్యం చేసి గడువు ముగిసే చిట్టచివరి సమయంలో సుప్రీంకోర్టులో ఎస్‌బిఐతో అసత్యాలు చెప్పించడం స్వతంత్ర్యంగా పనిచేసే చట్టపరమైన వ్యవస్థలను దుర్వినియోగం చేయడమే. బాహాటంగా తప్పులు మీద తప్పులు చేస్తూ ప్రజలకు జవాబుదారీ వహించకుండా తిరిగి అదే ప్రజలవద్దకు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వెళతారన్న ప్రశ్నను బిజెపి ఒక ప్రశ్నగా చూడటం లేదు. 1961 ఆదాయపన్ను చట్టంలోని 13 ఎ సెక్షన్ కింద దేశంలో ప్రతి రాజకీయపార్టీ ఆదాయపన్ను రిటన్స్‌ను దాఖలు చేసితీరాలి. ఇందులో భాగంగా బిజెపికి సుమారు ఏడువేల కోట్ల రూపాయలు కట్టబెట్టిన అస్మదీయ క్రోనీ క్యాపిటలిస్టుల చిట్టాను కూడా సమర్పించాల్సిందే. కానీ బిజెపి చట్టాలను తుంగలో తొక్కింది. ఏకంగా రాజ్యాంగాన్నే మార్చేస్తామని, మతరాజ్యాన్ని స్థాపిస్తామని కయ్యానికి కాలుదువ్వే బిజెపిని ఏ అధికారి సాహసించి లెక్కలు చూపించమని అడుగుతారని ధీమాగా వ్యవహరిస్తున్నది. కానీ దేశ సర్వోన్నత న్యాయస్థానం ముందు అందరూ సమానమే. సుప్రీంకోర్టుకు బిజెపి ఈ బాండ్ల విషయంలో ప్రత్యక్షంగా జవాబుదారీ కాకపోవచ్చు, కానీ అంతకంటే సర్వోన్నతమైన ధర్మాసనం ప్రజా తీర్పేనన్న విషయాన్ని కూడా బిజెపి గుర్తుతెచ్చుకోవాల్సిందే. చట్టాలు, నిబంధనల మాటున తాత్కాలికంగా బిజెపి దోబూచులాడవచ్చు. ''నాయనా పులి వచ్చె'' అన్నట్టుగా బూటకపు ప్రచారాలు, అసత్యాలతో బిజెపి ఎల్లకాలం ప్రజలను తప్పుతోవ పట్టించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా న్యాయస్థానంలో నిజం నిగ్గుతేలక మానదు.

# రికార్డుస్థాయిలో లోక్‌సభ ఎన్నికల ఖర్చులు!

నంటూ బెనర్జీ

స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియను భ్రష్టు పట్టిస్తున్న కొన్ని రకాల ఎన్నికల ప్రచార పద్ధతులను నియంత్రించేందుకు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అనేక సంవత్సరాలుగా తీవ్రంగానే ప్రయత్నిస్తున్నది. అయితే పాలక రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థు లు అనుసరిస్తు న్న అవాంఛిత విధానాలను కట్టడిచేయడం అనుకున్నంత సులభమేమీ కాదు. లోక్‌సభ అభ్యర్థికి అధికారిక ఖర్చు పరిమితి రూ.75లక్షల నుండి రూ.90లక్షల మధ్య ఉంటుంది. ఎన్నికల నిర్వహణ కోసం అంచనా వేసిన స్థూల వ్యయంలో దాదాపు 10 శాతం మొత్తాన్ని కేంద్రప్రభుత్వం భరిస్తుంది. అధికారికంగా, 2014 లోక్‌సభ ఎన్నికల కోసం రూ.38,700 కోట్లు ఖర్చు చేసింది. మిగిలిన మొత్తాన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఖర్చు చేశారు. అయితే, చట్టపరమైన లేదా ఖాతా ఖర్చులు అభ్యర్థులు, ఆయా పార్టీలు ఖర్చు చేసిన అసలు మొత్తంలో ఇది కొంతభాగం మాత్రమే. అనధికారికం గా లేదా వాస్తవ పరిస్థితుల్లో, అభ్యర్థి ఖర్చుచేసే డబ్బు అధికారిక ఖర్చు పరిమితి కంటే 10 నుండి 15 రెట్లు లేదా కొన్ని సందర్భాల్లో అంతకంటే ఎక్కువగా కూడా ఉండవచ్చు.

ఈ విషయంలో ఇసిఐ చేయగలిగింది కూడా ఏమీ లేదు. అభ్యర్థుల ఎన్నికల ప్రచార వ్యయం ఒకే మాదిరిగా ఉండదు. అభ్యర్థులను బట్టి, నిధులు సమకూర్చుకునే సామర్థ్యాన్ని బట్టి మారుతుంది. అధికార పార్టీ అభ్యర్థుల వద్ద ప్రభుత్వ ఒప్పందాలు లేదా చట్ట విరుద్ధంగా సేకరించిన నిధులు ఉంటాయన్నది అందరి ఏకాభిప్రాయం. ఇందులో వివిధ రకాల అక్రమ వ్యాపారాలు, లంచాలు, ఉద్యోగాల కోసం నగదు, హవాలా లావాదేవీలు వంటివి ఉండవచ్చన్న వాదన లేకపోలేదు. నల్లధనం దాశులపై కూర్చొని, అధికారాన్ని నిలుపుకోవడం కోసం ఎన్నికల్లో గెలుపొందేందుకు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. గెలిచిన తర్వాత, తదుపరి ఎన్నికల నాటికి రెట్టింపు డబ్బు సంపాదిస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవడమే తమ ధ్యేయంగా ఎంచుకుంటున్నారు. అసలైన ఓటర్లు తమ ఓట్లను వేయకుండా నిరోధించడానికి ఎంతకైనా తెగబడుతున్నారు. ఎన్నికలవేళ చాలా మంది అభ్యర్థులు అక్రమాలకు పాల్పడడం, కండబలాన్ని వినియోగించడం అసాధారణం కాదు, అయితే, ఘర్షణలు చోటు చేసుకున్న లేదా అక్రమాలు చోటుచేసుకున్న బూత్‌లలో మళ్లీ ఎన్నికలు జరుగుతాయి. దురదృష్టవశాత్తూ, ఎన్నికలు, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు తర్వాత ఇసిఐ పరిమిత అధికారంతో కొనసాగుతుంది. అధికార పార్టీకి అనుగుణంగా వ్యవహరించాలనే ఒత్తిడి సంస్థపై పెరుగుతుంది. ఏది ఏమైనా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయపు పన్ను శాఖ (ఐటి), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌తోసహా దాదాపు 20 కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీల సంయుక్త సేవలను ఉపయోగించడం ద్వారా ఎన్నికలలో అక్రమ డబ్బు ప్రభావాన్ని నిరోధించడానికి, విస్తృతంగా తనిఖీ చేయడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చొరవ చూపడం హర్షణీయం. ఈ క్రమంలోనే, విమానాశ్రయాలు, హెలిప్యాడ్లు, చార్టర్డ్ విమానాలలో వస్తువుల తరలింపుపై నిఘా ఉంచాలి. ఇది పూర్తిగా రాష్ట్రాల బాధ్యత అయినప్పటికీ, శాంతిభద్రతల పరిస్థితి సంక్లిష్టమవుతుంది. హింస, తీవ్రవాదాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించడానికి వీల్లేదు. సెంట్రల్ రిజర్వ్ పోలీసు బలగాలను రంగంలోకి దింపే ప్రణాళికను, ఆయా రాష్ట్రాల పోలీసు నోడల్ అధికారులు అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలి. స్వేచ్ఛ, న్యాయమైన, రాజకీయ ప్రేరేపణ రహిత ఎన్నికలను నిర్ధారించడానికి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నిర్దేశించిన అనేక ఇతర చర్యలలో ఇవి ఉన్నాయి. గత ఎన్నికల్లో ఇలాంటి చర్యలు తీసుకోలేదని అనుకోవడానికి వీల్లేదు.




కానీ, ఆశించిన ఫలితాలు రాలేదు. ఎన్నికల ప్రచారంలో నగదు కట్టల వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికార పార్టీలకు వివిధ శాఖల అండదండలు ఉంటాయి. పోలీసు యంత్రాంగం మద్దతు, సహకారం సహజమే. ఎన్నికల ప్రచారాన్ని బలోపేతం చేసేందుకు అభ్యర్థులు అక్రమ ధనం వెదజల్లుతున్నారు. ఏడు విడతల్లో, 543 స్థానాలకు జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రముఖ రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థులు గత రికార్డులన్నింటినీ అధిగమించి రికార్డు స్థాయిలో నగదు ఖర్చు చేయబోతున్నారని అంచనా. ఈసారి మొత్తం వ్యయం రూ.1.2 ట్రిలియన్లకు మించవచ్చని ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ పేర్కొంది. ఇది 14.4 బిలియన్ డాలర్లకు సమానమైన మొత్తం. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు, కాంగ్రెస్ ప్రచారాల సమయంలో ఖర్చు చేసిన డబ్బు కంటే కూడా ఇది ఎక్కువ. ఎలక్టోరల్ బాండ్లను సుప్రీం కోర్టు రద్దు చేసిన నేపథ్యంలో, జాతీయ స్థాయిలో భారతీయ జనతా పార్టీ (బిజెపి), రాష్ట్ర స్థాయిలో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) స్వల్పంగా ఇరుకున పడినప్పటికీ, రాబోయే ఎన్నికలలో ప్రచార వ్యయంపై ఎటువంటి ప్రభావం చూపే అవకాశం లేదు. తాజా ఎలక్టోరల్ బాండ్లు లేనప్పుడు, తదుపరి లోక్‌సభ ఎన్నికల కోసం బహిర్గతం చేయని సంస్థల ద్వారా చందా సేకరించడం జరిగిందనే అనుకోవాలి. 2017– 18 నుంచి 2022– 23 మధ్యకాలంలో రూ. 12,008 కోట్లు విలువ చేసే ఎలక్టోరల్ బాండ్లు అమ్ముడయ్యాయి. వాటిలో బిజెపి వాటా దాదాపు 55 శాతం లేదా రూ.6,564 కోట్లు. కాంగ్రెస్ పార్టీకి రూ. ఐదేళ్ల కాలంలో బాండ్ల ద్వారా లభించిన మొత్తం రూ. 1,135 కోట్లు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, రాష్ట్ర స్థాయి పార్టీ అయిన టిఎంసి అదే కాలంలో రూ.1,096 కోట్లను అందుకుంది. ఒక ప్రాంతీయ పార్టీకి ఇంత భారీగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా డబ్బు లభించడం విచిత్రం. 2022–23లో రాజకీయ పార్టీల ఎలక్టోరల్ బాండ్ల నిధులపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) ప్రచురించిన నివేదిక ప్రకారం, అదార్ పూనావాలా నేతృత్వంలోని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, పివి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలోని ప్రైవేటు సంస్థ మేఘా ఇంజినీరింగ్ కంపెనీ, లక్ష్మీ మిట్టల్ యాజమాన్యంలోని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా అతిపెద్ద దాతల జాబితాల్లోని మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాండ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెల్లడించి తీరాలని ఈనెల 18వ తేదీ, సోమవారం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)ని ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించడం గమనార్హం. కాగా, ఎలక్టోరల్ బాండ్ పథకం రద్దయినప్పటికీ, రాబోయే ఎన్నికల ప్రచారంలో ఖర్చు చేసేందుకు రాజకీయ పార్టీలు ఇప్పటికే భారీ మొత్తంలో నగదును కూడబెట్టుకున్నట్లు భావిస్తున్నారు. రాష్ట్రాల్లోని అధికార పార్టీలతో సహా చాలా పార్టీలు బహుళస్థాయి ఎన్నికల ప్రచార అజెండాలను రూపొందించాయి. ఉదాహరణకు, ఒక రాష్ట్ర స్థాయి అధికార పార్టీ నాయకుడు తాను రాష్ట్రవ్యాప్తంగా, ఒక్కొక్కటి 1,00,000 ప్రేక్షకులతో సుమా రు 100 సమావేశాలను నిర్వహిస్తానని పేర్కొన్నారు. సుదూర గ్రామాల నుండి ప్రతి వేదికకు పాల్గొనే వారి ప్రయాణ ఖర్చు, రాత్రిపూట బస, ఆహార సామాగ్రి, నగదు బహుమతులతో కూడిన ఇలాంటి భారీ సమావేశాలను నిర్వహించడానికి అయ్యే ఖర్చు ఊహించడానికే భయం వేస్తుంది. అంత పెద్ద మొత్తాలను అభ్యర్థులు సిద్ధంగా ఉంచుకుంటున్నారని సదరు నాయకుడి ప్రకటన స్పష్టం చేస్తున్నది. గత నెల నుంచే అధికార పార్టీల అధినేతలు వివిధ కొత్త ప్రాజెక్టులను ప్రకటించడం, శంకుస్థాపనలు చేయడం, పథకాల ప్రారంభోత్సవాలు చేయడం వంటి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. సుమారు నెలరోజుల వ్యవధిలోనే వివిధ పరిణామా ల్లో, వేల సంఖ్యలో ప్రాజెక్టులను ప్రకటించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార పార్టీలు అభివృద్ధి, ఉద్యోగా లు, కొత్త అవకాశాల కల్పన తదితర చర్యలతో ఓటర్లను ఆకట్టుకోవడం పరిపాటి. అయితే, ఈ విధంగా ఎన్నికలకు ముందు ప్రకటించిన ప్రాజెక్టుల్లో చాలావరకు వెలుగు చూడవు. వివిధ రకాల తక్కువ వేతన సర్వీస్ ప్రొవైడర్లకు వేతనపెంపు రూపంలో అదనపు నగదు తాయిలాల ప్రకటనలు పెరిగాయి. అయితే, ఇలాంటి 'అతి ధోరణి'ని నియంత్రించే సత్తా ఇసిఐకి లేదు. ఎన్నికలకు ముందు రాజకీయ దుమారం రేపేందుకు ఇసిఐ ఎంతమాత్రం ప్రయత్నించదు. ఈ అంశాలను ప్రభుత్వం, ఎన్నికల సంఘం విభేదించవచ్చు. అవినీతిని మరింత సంస్థాగతీకరించడానికి కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తునే ఉంటాయి. అనేక పర్యాయాలు అధికారంలో ఉండటానికి వీలుగా చోటు చేసుకుంటున్న అవినీతికి ఎన్నికల వ్యవస్థ పరోక్షంగా సహాయం చేస్తోంది.

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను విజయవంతంగా ముందుకు తీసుకుపోవడం ఒక పెద్ద సవాలు. రాజకీయ పార్టీల అపరిమిత ఎన్నికల వ్యయం తో ఎన్నికల 'స్వచ్ఛత' ప్రమాదంలో ఉందని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఎస్‌వై ఖురేషి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ప్రస్తావించక తప్పదు. ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకునే అధికారేతర పార్టీలకు వివిధ స్థాయిల్లో, వివిధ రకాలుగా ప్రజలను ఆకట్టుకోవడం లేదా ఓట్లను ఆకర్షించడం అధికార పార్టీల మాదిరి సులభం కాదన్నది తిరుగులేని నిజం. అయితే, ఇసిఐ తన అధికారాలను సమర్థంగా వినియోగించుకుంటే, స్వచ్ఛమైన, స్వేచ్ఛాయుతమైన సార్వత్రిక ఎన్నికల నిర్వహణ అసాధ్యమేమీ కాదు. ఇసిఐ నుంచి ఈ మార్పును కోరుకుందాం. (ఐపిఎ సౌజన్యంతో)

## ఆకలితో అల్లాడుతున్న బాల్యం

మన దేశంలో బాల్యం ఆకలితో అల్లాడుతున్నది. గుప్పెడు మెతుకులు కరవై అలమటిస్తున్నది. కాలేకడుపులు.. ఇంకిన కన్నీళ్లతో కాలం గడిపేస్తున్నది. రోజుల తరబడి మెతుకు దొరకని చిన్నారులు పడుతున్న వేదన పట్టని పాలకులు... నిరుద్యోగం కనీవినీ ఎరుగని రీతిలో తారస్థాయికి చేరింది. సామాన్యుడి ఆదాయం దారుణంగా పడిపోయింది. ఉద్యోగాలు లేవు... సంపాదన లేదు... ఎక్కడ చూసినా నీలి నీడలే.. కప్పిపుచ్చలేరన్నది నిజం. ప్రవహించే నదులు.. పచ్చని పొలాలు... సహజ వనరులు సమృద్ధిగా ఉన్న దేశం చిన్నారుల ఆకలి కేకలు.. రోదనలు.. వేదనలతో హోరెత్తిపోతున్నది. రోజుల తరబడి ఆహారం దొరకని పిల్లల విషయంలో కాంగో (7.4 శాతం), పాకిస్థాన్ (9.2 శాతం), నైజీరియా (8.8 శాతం), బంగ్లాదేశ్ (5.6 శాతం) మన కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయి. దేశంలో ఆహార లభ్యత ప్రమాదకర స్థాయికి



కనీస ఆదాయం కూడా దొరకని కోట్లాది మంది దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశం ఇది. రోజుల తరబడి ఆహారం లేని పిల్లలు 19.3 శాతంగా ఉన్నారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే స్పష్టం చేస్తున్నది. గినియా (21.8 శాతం), మాలి (20.5 శాతం) తర్వాత మూడో స్థానంలో ఉన్న భారత్, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగివున్న దేశాల్లో ఐదో స్థానంలో ఉందంటే, సంపాదన ఎంతగా కేంద్రీకృతమవుతున్నదో అర్థమవుతుంది. అభివృద్ధి లో దూసుకెళుతున్నామనే వాదనతో వాస్తవ పరిస్థితులను పతనమైంది. మరుసటి రోజు తినడానికి ఏదైనా దొరుకుతుందో? లేదో? తెలియని అనిశ్చితి. అసలు ఆహారమే అందకుండా అల్లాడే పిల్లలు 80 లక్షల మంది... వారిలో 67 లక్షల మంది మన దేశంలోనే ఉన్నారు. కుటుంబ భారాన్ని మోయడానికి కూలీకి వెళ్లి పనులు చేయాల్సిన తల్లులు తమతమ శిశువులకు ఆహారం ఇవ్వడానికి కూడా సమయం లేకపోవడం కూడా ఈ లేమికి ఒక కారణం.

పౌష్టికాహారం మాట పక్కకు ఉంచితే, దేశంలో లక్షలాది మంది పిల్లలకు అసలు ఆహారమే లభించడం లేదు. మూడు నుంచి ఆరు నెలల మధ్య వయసు ఉన్న చిన్నారుల్లో 'జీరో ఫుడ్' సమస్య అత్యధికం. వారు 24గంటల కంటే ఎక్కువ ద్రవ లేదా ఘనాహారం దొరక్క, జీవన్మరణ సమస్య ఎదుర్కొంటున్నారు. నెలలు గడుస్తున్న కొద్దీ పిల్లలు పెరుగుతారు. వారికి పోషకాహారం అవసరం కూడా పెరుగుతుంది. విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజాలు, శక్తి అవసరం. కానీ, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి వారి ఆకలి తీర్చలేకపోతున్నది. ఇక పౌష్టికాహారానికి అవకాశం ఎక్కడ? దురదృష్టవశాత్తు మనదేశంలో పిల్లల గురించి ప్రభుత్వాలకు పట్టింపు ఉండదు. అత్యధిక శాతం తల్లిదండ్రులకు ప్రతిరోజూ జీవన్మరణ సమస్యే కాబట్టి, పిల్లలను పట్టించుకునే ఓపిక, తీరిక అసలే ఉండవు. నేటి పిల్లలే భావి పౌరులనే వాస్తవాన్ని విస్మరించడం మనకు ఆనవాయితీ. మురికివాడల్లో ఈగ లు, దోమలతోనే పిల్లల సావాసం. కాలు ష్య కోరల్లో వసివాడుతున్న బాల్యం. తిండిలేక బక్కచిక్కిన పసితనం.

ఆకలికి ఆగలేక, గుక్కపట్టి ఏడుస్తున్న భావి తరం. ఇక్కడ బడి బాట తొక్కని చిన్నారులు ఎందరో. ఇక్కడ బతుకే ఓ యుద్ధరంగం. నగర ఎడారిలో ఒయాసిస్సులను వెతుక్కుంటున్న జనబాహుళ్యం. కష్టాల కడలిలో కొట్టుకుపోతున్న చిన్నారుల ఆక్రందనలు వినలేని ప్రభుత్వాలు ఉండడం మన దౌర్భాగ్యం. ఏడవడానికి కూడా ఓపికలేక, సొమ్మసిల్లి పడిపోతున్న పిల్లలు.. ఊపిరి ఉన్న శవాలు.. చిన్నారుల కడుపు నింపలేని అభివృద్ధికి అర్థం ఏమిటి? బలవంతంగా పిల్లల ప్రాణాలు తీసుకున్న పరిస్థితులను చక్కదిద్దలేని ప్రభుత్వాలు ఎందుకు? ఏం చేయడానికి? ఎవరిని ఉద్ధరించడానికి? ఏ తీరాలకు మన ప్రయాణం. ఎవరి ప్రయోజనాల కోసం ఈ ప్రభుత్వాల ఆరాటం?

## ఉత్తమ జీవన విధానమే ప్రకృతి వైద్యం

ఉత్తమ జీవనశైలి అనేది శ్రేయస్సు, సమతుల్యత, నెరవేర్పును ప్రోత్సహిస్తుంది. ఇది సాధారణ శారీరక శ్రమ, సమతుల ఆహారం, తగినంత నిద్ర, అర్థవంతమైన సామాజిక సంబంధాలు ఒకరి రోజువారీ కార్యకలాపాలలో ప్రయోజనం లేదా నెరవేర్పు వంటి అంశాలను కలిగి ఉంటుంది. ప్రతి ఒక్కరి అవసరాలు ప్రాధాన్యత లు భిన్నంగా ఉంటాయి. కాబట్టి వ్యక్తిగతంగా మీకోసం పనిచేసే జీవనశైలిని కనుగొనడం చాలా ముఖ్యం. స్వీయసంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం, ఒత్తిడిని నిర్వహించడం, ఆనందం, సంతృప్తిని కోరుకోవడం ఆరోగ్యకరమై న జీవనశైలిలో కీలకమైన అంశాలు. ప్రకృతి వైద్యం శతాబ్దాలుగా ఆచరించబడింది. ప్రపంచ వ్యాప్తం గా వివిధ సంస్కృతుల నుండి సంప్రదాయ వైద్యం వివిధ పద్ధతులపై ఆధారపడింది.




నేడు, వెల్‌నెస్ సెంటర్ లు, నేచురోపతిక్ ఫిజిషియన్‌లు వ్యక్తుల సంపూర్ణ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అనేక రకాల చికిత్సలను అందిస్తూనే ఉన్నారు. మానసిక, శారీరక జీవనశైలి కారకాలపై అవగాహనతో సహజ నివారణలు సమగ్రపరచడం ద్వారా, ప్రకృతి వైద్యులు ప్రతి రోగి యొక్క ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సమగ్ర సంరక్షణను అందించగలరు. ఈ విధానం రోగులకు వారి ఆరోగ్యాన్ని కాపాడ డంలో చురుకైన పాత్రను పోషించడానికి అనుమతిస్తుంది. వారి సంరక్షణ, జీవనశైలి ఎంపికలు గురించి సమాచార నిర్ణయాలు తీసుకునేలా, వారికి సహాయపడగలదు. నేచురోపతి చికిత్సలో తరచు గా పోషకాహార కౌన్సిలింగ్, హెర్బల్ మెడిసిన్, ఆక్యుపంక్చర్, హైడ్రోథెరపీ, జీవనశైలి మార్పుల తో సహా అనేక రకాల పద్ధతులు కలిగి ఉంటాయి. అనారోగ్యం, అసమతుల్యత యొక్క అంతర్లీన కారణాలు పరిష్కరించడం ద్వారా, కేవలం లక్షణాలకు చికిత్స చేయడం కంటే, ప్రకృతి వైద్య ఔషధం దీర్ఘకాలిక ఆరోగ్యం, శక్తిని ప్రోత్సహించ డం లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్యం, ఆరోగ్యానికి మరింత సమగ్రమైన విధానాన్ని కోరుకునే వారికి, ప్రకృతి వైద్యం ఒక విలువైన ప్రత్యామ్నాయాన్ని, సంప్రదాయ వైద్య సంరక్షణ పూర్వకంగా అందిస్తుంది. నివారణ, స్వీయసంరక్షణ, సహజ వైద్యం పద్ధతుల యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ప్రకృతి వైద్య కేంద్రం, వెల్‌నెస్ రిట్రీట్ సంపూర్ణ శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఒక నిర్మలమైన స్వర్గధామంలా అనిపిస్తాయి. సహజ వైద్యం, సమతుల్య పునరుద్ధరణపై సంపూర్ణంగా సమలేఖనం చేసే అనేక ప్రయోజనాల ను ఆవిరి స్నానాలు నిజంగా అందిస్తాయి. స్టీమ్ బాత్ థెరపీ ద్వారా మంచి ప్రయోజనాలు చేకూరుతా యి. స్టీమ్ బాత్‌లో చెమటపట్టే ప్రక్రియ ఓపెన్ ఫోర్స్ ద్వారా శరీరం నుండి టాక్సిన్స్, మలినాల ను తొలగించడంలో సహాయపడుతుంది, పునరుజ్జీవనం రిఫ్రెష్‌గా అనిపిస్తుంది. రక్త నాళాలను విస్తరించడం ద్వారా, ఆవిరి స్నానాలు రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. శరీరమంతా అవసరమైన పోషకాలు, ఆక్సిజన్‌ను పంపిణీ చేస్తాయి, తద్వారా సరైన అవయవం కండరాల పనితీరు మెరుగుపడుతుంది. స్టీమ్ బాత్ యొక్క వెచ్చని, ప్రశాంత వాతావరణం కండరాల సడలింపు , మానసిక ప్రశాంతతను ప్రోత్సహిస్తుంది, ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది, శాంతియుత భావాన్ని ప్రేరేపిస్తుంది. ఉబ్బసం లేదా అలర్జీ వంటి శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి ఆవిరి స్నానాలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఆవిరి శ్వాసనాళాలను క్లియర్ చేయడంలో సహాయపడుతుంది. శ్లేష్మం సడలించడం, రద్దీని తగ్గించడం ద్వారా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులను తగ్గిస్తుంది. రంధ్రాలను తెరవడం, చర్మాన్ని శుభ్రపరచడం, ఆవిరి స్నానాలు స్పష్టమైన ఛాయ, మెరుగైన చర్మపు రంగుకు దోహదం చేస్తాయి. చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడతాయి. ఆవిరి స్నానాల యొక్క వేడి, తేమ అలసిపోయిన గొంతు కండరాలకు ఉపశమనాన్ని అందిస్తాయి. వేగంగా కోలుకోవడానికి శారీరక శ్రమ లేదా ఒత్తిడి తర్వాత విశ్రాంతిని ప్రోత్సహిస్తాయి. నేరుగా బరువు తగ్గించే పద్ధతి కానప్పటికీ, ఆవిరి స్నానాలు అధిక చెమట ద్వారా అదనపు నీటి బరువును తొలగించడంలో సహాయం చేయడం ద్వారా బరువు తగ్గించే ప్రయత్నాలను పూర్తి చేయగలవు, జీవక్రియ నియంత్రణలో సమర్థవంతంగా సహాయపడతాయి. ఆరోగ్యానికి మీ సంపూర్ణ విధానంలో భాగంగా ఆవిరి స్నానం చికిత్సను అందించడం ద్వారా, శరీరం, మనస్సు రెండింటినీ పెంపొందించే పునరుజ్జీవన అనుభవాన్ని అందిస్తున్నారు. నిర్వాణ నేచురోపతి మరియు రిట్రీట్‌లో మీ చికిత్సల శ్రేణికి ఇది అద్భుతమైన జోడింపు, సరైన ఆరోగ్యం, జీవశక్తి కోసం వారి ప్రయాణంలో వ్యక్తులకు మద్దతునిస్తుంది.

డా.ఎం.అఖిల మిత్ర,
ప్రకృతి వైద్యులు.

లేఖలు

## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలి

సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం(నాయక్) నాయకత్వంలో కంపెనీలో సుహృద్భావ స్నేహపూరిత అహ్లాదకర వాతావరణంలో పరిపాలన ఉత్పత్తి ఉత్పాదకతలు మునుపెన్నడూ లేని విధంగా కొనసాగుతున్నవి. ప్రతి పరిశ్రమలో పారిశ్రామిక సంబంధాలు మెరుగుపరుచుటకు ఈ విధమైన పద్ధతి దోహదం చేస్తుంది మొట్టమొదటిసారిగా సింగరేణి లో ఇట్లాంటి వాతావరణం ఏర్పడడం అత్యంత ఆనందదాయకం. నిర్ణయించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించుటకు సమిష్టిగా అందరితో మమేకమై చిరు ఉద్యోగి అత్యున్నత అధికారి అనే తరతమ భేదం లేకుండా బలరాం నాయక్ కృషి చేస్తు పాటిస్తున్నారు కూడా. అత్యంత ముఖ్య విషయం సింగరేణిలో పనిచేస్తున్న అంతర్గత ఉద్యోగులకు విద్యార్హతలు ననుసరించి పై ఉద్యోగాలు పొందుటకు ప్రత్యేకంగా అధిక శాఖలలో విస్తృత స్థాయిలో నియామకాలు చేపట్టడం హర్షించదగ్గ విషయం. నాకు తెలిసినంతవరకు ఇంత పెద్ద ఎత్తున మొట్టమొదటిసారిగా చేపడుతున్న గొప్ప మహత్తర కార్యక్రమం. ప్రస్తుతం చాలామంది అత్యున్నత విద్యాధికులు తక్కువ స్థాయి ఉద్యోగాలు డిపెండెంట్ ద్వారా చేస్తున్నా రు ఈ నియామక ప్రక్రియ తో వారి జీవితాలలో క్రొత్త వెలుగులు ఉదయిస్తాయి ఫలితంగా వీరి స్థానాలలో క్రొత్తగా నియామకాలు జరుపుటకు వీలు కలి గి నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ కార్మికులతో మమేకమై ఆరోగ్యము సంక్షేమలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతూ గతంలో ఏ చైర్మన్ చేయని విధంగా అర్ధరాత్రి ఒక కార్మికుని వైద్య సహాయ ఫోన్‌కు స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకున్నారు. గని ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికున్ని స్వయంగా పరామర్శించి వైద్య సహాయానికి తోడ్పడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. సింగరేణి బలపడుటకు పలు విధములైన చర్యలు చేపట్టి బలమైన పునాదులు వేస్తున్నారు. సింగరేణి ప్రస్తుత లాభాలకు పునాదులు వేసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కూడా ఇదే విధమైన ప్రేమాభిమానాలు చూపి ఉచిత అపరిమిత వైద్య సౌకర్యాలు కోలిండియాతో నిమిత్తం లేకుండా కల్పిస్తారని మనసారా వేడుకొనుచున్నా ము. చాలీచాలని పెన్షన్ తో కాలం గడుపుతున్నాము జీవిత చరమాంకంలో సరియైన వైద్య సౌకర్యాలు అందక అల్లాడిపోతున్నాం సార్.

సంస్థ లో 51 శాతం వాటా కలిగి ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సింగరేణి లాభాల బాటలో పయనిస్తున్నది. రాష్ట్ర పురోభివృద్ధికి గతంలో నిధులను సమకూర్చారు. ఇదే విధమైన స్ఫూర్తిని రిటైర్డ్ ఉద్యోగుల పట్ల చూపుతు తగు విధమైన వైద్య సేవలు కల్పించుటకు ప్రజాస్వామ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సంప్రదించి తొందరగా నిర్ణయం తీసుకొని మాకు ఆరోగ్యవంతమైన జీవనయానం కల్పించి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించుటలో రాష్ట్రంలోని ఇతర పరిశ్రమలకు సింగరేణి ఆదర్శమైన సంస్థగా నిలుస్తుందని ఆశిస్తున్నాను.

దండంరాజు రాంచందర్ రావు

## బొగ్గు పెన్షన్ దారులకు నిధి ఏర్పాటు చేయాలి

దేశవ్యాప్తంగా దాదాపు ఆరు లక్షల మంది బొగ్గు పెన్షన్ దారులకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం–1998 ప్రకారం కనీస పెన్షన్ రూ.350 నిర్ణయించబడింది. ఇరవై నాలుగు సంవత్సరాల నుంచి జాతీయ కార్మిక సంఘాలు, బొగ్గు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘాల ఆందోళనల ఫలితంగా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వారి ట్రస్ట్ బోర్డ్ ప్రతిపాదన మేరకు కనీస పెన్షన్ రూ.1,000 లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నేటి కాలంలో 1,000రూపాయలతో పెన్షన్ దారుల కనీస అవసరాలు తీరేనా? ఇట్టి పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించే వృద్ధాప్య పెన్షన్ రెండువేల రూపాయల కన్నా తక్కువ వుండటం విస్మయం కలిగిస్తుంది. గనులలో అధిక వేడి, వెలుతురు, గాలి ఉండక పోవటంతో చాలా మందికి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఉంటారు. పదవీ విరమణ తరువాత గుండె జబ్బులు, రక్త పోటు, మూత్రపిండాల వ్యాధులతో మరింతగా మంచాన పడుతున్నారు. బొగ్గు గని కార్మికులు దేశానికి వెలుగు నిచ్చే కాగడాలు, అంతే కాని సేవా రంగంలో పనిచేసే ఉద్యోగులు కారు. ప్రభుత్వ ఉద్యోగులకు వారు పనిచేసే కాలంలోని జీతం కంటే ప్రస్తుతం పెన్షన్ సొమ్ము ఎక్కువగా ఉంది. బొగ్గు కార్మికులు ఏ పాపం చేశారు? వారికి ప్రభుత్వ ఉద్యోగుల కంటే పెన్షన్ తక్కువ రావడానికి కారణం ప్రభుత్వాలు వారి సేవలను గుర్తించుట లేదు. బొగ్గు కార్మికులను యాజమాన్యాలు కాలం చెల్లిన యంత్రాలను మూలకు వేసినట్లుగా పని దిగిపోయిన కార్మికుల పట్ల ఏ మాత్రం శ్రద్ధ వహించు ట లేదు. బీద వర్గాలకు జారీచేసే తెల్ల కార్డులకు కూడా అర్హత లేకుండా జీవిస్తున్నారు. ఈ వేయి రూపాయలతో వారి బాధలు తీరవు.

గత 24 సంవత్సరాల నుంచి కరువు భత్యంతో కూడిన కనీస పెన్షన్ 10,000 రూపాయలు చెల్లించాలని ఎన్నో సార్లు కేంద్రప్రభుత్వ మంత్రులకు, అధికారులకు విన్నవించుకున్నారు. పెన్షన్ ఫండ్‌లో కొరత ఉందని, రోజురోజుకు పెన్షన్ దారుల సంఖ్య పెరగడం, బొగ్గు పరిశ్రమలో నూతన నియామకాలు తగ్గడంతో పెన్షన్ ఫండ్ బలహీన పడుతుంది. గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ వారు 727కోట్ల రూపాయల మోసం వలన కూడ పెన్షన్ ఫండ్ తగ్గింది. గతంలో నిర్ణయించిన టన్ను బొగ్గుకు 10 రూపాయలు పెన్షన్ ఫండ్‌లో జమ చేయడం పూర్తి స్థాయి లో అమలుకావడం లేదు. టన్ను బొగ్గు అమ్మకంపై 20 రూపాయలు వసూలు చేయాలని ప్రతిపాదనలు వచ్చాయి. బొగ్గు యాజమాన్యాల వారు ఆర్జిస్తున్న లాభాల నుంచి ఐదు శాతం పెన్షన్ ఫండ్‌లో జమ చేయాలని, పెన్షన్ ఫండ్ బలోపేతం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బొగ్గు యాజమాన్యాలు ప్రతి సంవత్సరం బొగ్గు విశ్రాంత కార్మికులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి శాశ్వత ప్రతిపాదనలు చేస్తే బొగ్గు పెన్షన్ దారుల కష్టాలు తీరుతాయి తప్ప వేయి రూపాయలతో వారి కష్టాలు తీరవు.

ఎవి. మాధవ్

# అక్రమ నగదు, మద్యం తరలింపు అడ్డుకోండి

### ప్రతి వాహనాన్ని తనిఖీ చేయండి
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ తరలింపును అధికారులు అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ జిల్లా సరిహద్దు చొప్పదండి మండలం ఆర్నకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీకి సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టులో వసతుల కల్పన ఎలా ఉందని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేయాలన్నారు. వాహనాల నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ తరలింపును అడ్డుకుని తీరాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీని స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్, ఎస్‌ఐని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, తహసీల్దార్ నరేందర్, ఎస్‌ఐ ఉపేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**24 గంటలు అందుబాటులో కంట్రోల్ రూం**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా డబ్బు, మద్యం తరలించినా, పంపిణీ చేసినా, కోడ్ ఉల్లంఘన జరిగినా ప్రజలు నిర్భయంగా కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూంను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. కంట్రోల్ రూంలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే 1950, 18004254731 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టే అంశంపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో అధికారులు చేరుకుని విచారణ జరుపుతారని తెలిపారు. ఓటరు కార్డు రాకున్నా, ఓటు హక్కు ఉన్నదా? లేదా? తెలుసుకోవడంతో పాటు పలు అనుమానాలు నివృత్తి కోసం ఆయా నంబర్లకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. దీంతో పాటు సివిజిల్ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. ఎక్కడైనా డబ్బులు, మద్యం పంచిన, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకునేందుకు, బ్యానర్లు, పోస్టర్లు, మైక్‌లు, సౌండ్‌బాక్సుల ఏర్పాటు కోసం సువిధ కింద ఆన్‌లైన్లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు లేని వారు కొత్తగా నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు అనుమతి ఉన్నదని చెప్పారు. 18 ఏళ్లు దాటిన వారు ఓటు హక్కు కోసం ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని, దీంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, సిపిఓ కొమురయ్య, ఆర్డీవో కె. మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, నాగార్జునతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విపత్తుల నియంత్రణపై జిల్లా స్థాయిలో సమాచార సేకరణ

### కలెక్టర్ హనుమంతు కె.జెండగే



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ఈనెల చివరిలోగా జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర విపత్తుల సంస్థ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాతీయ విపత్తుల మేనేజ్‌మెంట్‌పై తీసుకోవలసిన చర్యలను ఆయన సోమవారం వివరించారు. జాతీయ విపత్తులు ఏర్పడినప్పుడు ఎదుర్కొనే విధానాలపై జిల్లా విపత్తుల మేనేజ్‌మెంట్ యాక్ట్ 2005, తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రణాళిక ప్రకారం జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖలు సమగ్ర సమాచారం ఈనెల చివరిలోపు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ కోఆర్డినేటరు గౌతమ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

## ఆర్‌డిఒ శ్రీనివాసులుకు సన్మానం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ ఆర్‌డిఒగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులను టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు అధికారులకు మధ్య సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు నిత్యం అవసరమైన వార్తలను అందించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా సహకారం అందించాలన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. జర్నలిస్టులకు ఎప్పుడు ఎలాంటి సమాచారం అడిగిన తప్పనిసరిగా అందచేస్తామన్నారు.కార్యక్రమంలో టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు, సంఘ నాయకులు నరేందర్‌రెడ్డి, దేవరం రాంరెడ్డి,పిల్లలమర్రి శ్రీనివాసరావు, బసవోజు శ్రీనివాసచారి,రావుల రాజు యాదవ్,ఇందిరాల రామకృష్ణ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయకుంటే కఠిన చర్యలు తప్పవ్

### ఎంఎల్‌ఎ బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని ఎంఎల్‌ఎ బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. సీజన్ ప్రారంభంలో రూ.2700 ధర చెల్లించిన మిల్లర్లు ఒకేసారి ధర తగ్గించడం సమంజసం కాదన్నారు. రూ.2500 ధర ఇచ్చే విధంగా చూడాలన్నారు. నామమాత్రంగా కొంతమంది మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల రోజుల తరబడి రైతులు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసి సకాబిల్లులు చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### కలెక్టర్ బి.ఎం. సంతోష్



**ప్రజాపక్షం / గద్వాల :** ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రజల ప్రజాప్రతి నిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన చాంబర్‌లో నాగర్ కర్నూల్ ఎం.పి ఎన్నికలకు సంబందించి వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతి నిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు సమావేశాలు నిర్వహించేందుకు సువిదా పోర్టల్ ద్వారా అనుమతులు పొందవచ్చని తెలిపారు. పత్రికలలో ప్రకటనల కోసం ఎంసి, ఎంసి ద్వారా అనుమతులు పొందాలని అన్నారు. అలాగే ఎన్నికల అక్రమాలపై,నియమావళిపై సి విజిల్ యాప్ ద్వారా పిర్యాదు చేయవచ్చని, పిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు , వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

## చెవిదిద్దులు కొనివ్వలేదని భర్తపై హత్యాయత్నం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భర్తపై భార్య హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. చెవిదిద్దులు కొనివ్వ లేదని టర్పెంటాయిల్ పోసి నిప్పంటించింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరంలోని నిజాంపేటలో షేక్ యాకూబ్, సమీనా దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత కొంత కాలంగా భార్య సమీనా చెవిదిద్దులు కొనివ్వాలని భర్తను అడగసాగింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇట్టి విషయంపై వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. చెవిదిద్దులు కొనేందుకు తన వద్ద నగదు లేదని భర్త యాకూబ్ చెప్పడంతో క్షణికావేశానికి గురైన భార్య సమీనా పెయింట్స్‌కు వాడే టర్పెంటాయిల్ భర్తపై పోసి నిప్పంటించింది. మంటల్లో కాలుతూ యాకూబ్ పాషా గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు, బంధువులు వచ్చి మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. యాకూబ్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ‘పది’ పరీక్షకు మొదటి రోజు 161మంది గైర్హాజరు



**ప్రజాపక్షం /నల్లగొండ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా, జిల్లా కలెక్టర్ దాసరి చందన నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 109 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో 107 రెగ్యులర్ పరీక్ష కేంద్రాలు, 2 ప్రైవేటు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ,19302 మంది రెగ్యులర్ విద్యార్థులు, 413 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన కలెక్టర్ కు వివరించారు . మొదటి రోజే 151 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష జరిగితున సమయంలో జిల్లా కలెక్టర్ సెంట్ ఆల్ఫాన్సెస్ జిల్లా విద్యా శిక్షణ సంస్థ ఆవరణలో ఉన్న గొల్లగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్లను అనుమతించవద్దని, పోలీసు చెకింగ్ జాగ్రత్తగా చేయాలని, పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత కేంద్రంలోకి వదలాలని, ఇతరులు ఎవరని పరీక్ష కేంద్రంలో అనుమతించవద్దని ఆదేశాలు జారీ చేశారు .ఎవరైనా విద్యార్థులు పరీక్షకు ఆలస్యంగా వస్తున్నారా? అని జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతిని అడగగా, సకాలంలోనే విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఈ పరీక్ష కేంద్రానికి 230 మంది విద్యార్థులను కేటాయించగా, 229 మంది హాజరు కాగా, ఒకరు మాత్రం గైర్హాజరైనట్టు ఆ పరీక్ష కేంద్రం సూపరింటిండెంట్ డి.చంద్ర నాయక్ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. జిల్లా విద్యా శిక్షణా సంస్థ ఆవరణలో ఉన్న విద్యాశాఖకు సంబంధించిన పలు భవనాలు, ఇతర అంశాలను జిల్లా కలెక్టర్ డిఇఒను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులకు తావివ్వవద్దని, అన్ని కేంద్రాలలో అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స వంటి ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రంలోకి ఎవరు సెల్ఫోన్లు తీసుకురావద్దని చెప్పారు.
అలాగే పరీక్ష కేంద్రాల పరిధిలో 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని ఆమె ఆదేశించారు.కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

## మీడియా అకాడమి చెర్మన్‌కు గద్వాల విలేకరుల సన్మానం



**ప్రజాపక్షం / అలంపూర్ :** తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ కె.శ్రీనివాస రెడ్డిని హైదరాబాదులో నవచేతన విజ్ఞాన సమితి గిరిప్రసాద్ భవన్‌లో జోగులాంబ గద్వాల ప్రజాపక్షం పత్రిక స్టాఫర్ శాంతిరాజు, వడ్డేపల్లి విలేఖరి బుచ్చన్న, మానపాడు విలేఖరి శాంతకుమార్, అలంపూర్ విలేఖరి రామాంజనేయులు,సన్మానించారు.

## టెన్త్ ఎగ్జామ్స్‌కు వెళుతుండగా ప్రమాదం

### ఇద్దరు విద్యార్థులకు గాయాలు



**ప్రజాపక్షం/మానపాడు :** బైక్ అదుపు తప్పి ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.వివరాల్లోకి వెళితే సోమవారం నుండి జరిగే పదవ తరగతి పరీక్షల కోసం మానవపాడు మండలం చిన్న పోతులపాడు, గ్రామానికి చెందిన ప్రవీణ్,మధులకు మానవపాడులో పరీక్ష సెంటర్‌కు వెళ్ళే క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు దాంతో వారికి తీవ్ర గాయాలు కాగా మానవపాడులో ప్రథమ చికిత్స అందించారు అనంతరం మెరుగైన చికిత్సకోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. దీంతో పరీక్షకు వారు హాజరు కాలేకపోయారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ బస్సులు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని మండి పడ్డారు. ఇకనైనా ఇలాంటి సంఘటనలు జరగకుండా జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని కోరారు.

## తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతురాజు రజిని రాజశేఖర్ తన పదవితో పాటు ఐదవ వార్డు కౌన్సిలర్‌కు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను జిల్లా కలెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు ఆమె సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ కారణంగా ఈనెల 20న కలెక్టర్ అవిశ్వాసం తేదీని ప్రకటించారు. ఈ తరుణంలో చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామ చేయడంతో రాజీకయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సుస్థిరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### జిల్లా వ్యాప్తంగా బిఆర్‌ఎస్ నుండి భారీగా చేరికలు
### ఎంఎల్‌ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భావితరాల సుస్థిరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమనీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే ప్రజాపాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరుగ్యారంటీలను చూసి ఆకర్షితులై కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి పట్ల నమ్మకంతో జిల్లా వ్యాప్తంగా బిఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పోచంపల్లి మండల, పట్టణానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ కీలక నాయకులు 150 మందినీ ఆయన నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్‌ఎస్ పార్టీని వీడిన వారిలో పద్మశాలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తడక రమేష్, ముక్తాపురం కౌన్సిలర్ దారెడ్డి మంజుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ యంపిటిసి కొట్టం కరుణాకర్ రెడ్డి, మైల అయిలయ్య, మాజీ వార్డ్ మెంబర్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్,మద్ది మదుసూదన్ రెడ్డి, ఎలగందుల నర్సిహ్మ,ఎడ్ల లింగస్వామి,మాజీ సర్పంచ్ టింగిల్ కార్ వెంకటేష్,మాజీ సర్పంచ్ ఆకుల శ్రీలతా మదుసూదన్,పెద్దల బాలయ్య, కొట్టం ప్రకాష్ రెడ్డి,కొట్టం వేమన్ రెడ్డి,కొట్టం శ్రీనివాస్ రెడ్డి,గుత్త శేఖర్,కొమరెల్లి ప్రతాప్ రెడ్డిలు ముఖ్యులు. ఈ దెబ్బతో మండల వ్యాప్తంగా బిఆర్‌ఎస్ పార్టీకి పెద్ద గండి పడింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అన్ని గ్యారంటీలను అమలుపరుస్తున్న తీరును చూసి రాష్ట్ర ప్రజలందరూ హర్షిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తెలంగాణ వాదులు అభిమానులు ప్రజాస్వామ్యవాదులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించారనీ వారందరి కలల సాకారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓట్లతో గట్టిగా బుద్ధి చెప్పినప్పటికీ వారు తీరు మార్చుకోక ఏవేవో పిచ్చి కూతలు కూస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షానికి దిమ్మతిరిగే సమాధానం చెప్పేందుకే ఇతర పార్టీల నాయకులను చేర్చుకునేందుకు సీఎం తలుపులు తెరిచి పెట్టారని చెప్పారు.100 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజామోదయోగ్యమైన పాలన దిశగా దూసుకుపోతున్న అద్భుత పనితీరును చూసి ఇతర పార్టీ అగ్ర ప్రజా ప్రతినిధులు సైతం కాంగ్రెస్ పార్టీలోకి వరుస కడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న నాయకుల వల్ల కార్యకర్తల్లో నాయకుల్లో కొన్ని తాత్కాలిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గ్రామాల, వార్డుల వారీగా ఉన్న ముఖ్య కార్యకర్తలతో అనుసంధాన అభిప్రాయ అంగీకారంతోనే ఈ మార్పులు చేర్పులు జరుగుతున్నాయనీ కార్యకర్తల గౌరవం ముఖ్యమని అన్నారు. కొత్తగా వచ్చిన వారందరికీ ఎలాంటి కండీషన్స్ లేవని పదవుల ఆశలు పెట్టుకున్నప్పటికి అప్పటి పరిస్థితుల దృష్ట్యా నాయకుల బలాబలాలు మెరిట్ మీదనే టికెట్లు ఇచ్చి నిలబెట్టి గెలిపించుకుంటామని నాయకులకు బరోసా ఇచ్చారు. ముఖ్యంగా తడక రమేష్ ఆధ్వర్యంలో ఇంకా భారీ చేరికలు ఉంటాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు తడక వెంకటేష్,పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్,పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్,జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మర్రి నరసింహ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రాఘవ రెడ్డి, మదుసూదన్ రెడ్డి, ఆర్జిపిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గునిగంటి రమేష్ గౌడ్, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, భారత వాసుదేవ్,యతినందం, కుక్క కుమార్, తదితరులు పాల్గోన్నారు.

## పదవతరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి

### పరీక్షా కేంద్రాల్లో ఆకస్మీకంగా కలెక్టర్ వెంకట్రావ్ తనిఖీలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పట్టణంలోని 60 ఫీట్ రోడ్డుగల కాకతీయ హైస్కూల్, వివేవవాణి విద్యామందిర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పదవతరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని, పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. సెల్‌ఫోన్‌లను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిలేదని, ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తరువాతనే లోనికి పంపాలని, సెల్‌ఫోన్‌లను అనుమతించవద్దని ఆదేశించారు. మొదటిరోజు జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 11,943 మంది విద్యార్థులకు గాను 11904 మంది విద్యార్థులు హజరయ్యారని, 39మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. ఆకస్మీకంగా తనిఖీ చసిన కాకతీయ హైస్కూల్ నందు 140 మంది విద్యార్థులకు గాను 139 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ శ్రీహరి కలెక్టర్‌కు వివరించారు. అలాగే వివేకవాణి విద్యామందిర్ హైస్కూల్ నందు 180 మంది విద్యార్థులకు గాను 180 మంది పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరిండెంట్ రమణారెడ్డి కలెక్టర్‌కు తెలిపాపరు. పరీక్షా కేంద్రాలలో విద్యుదీకరణ, తాగునీటి వసతి, బెంచీల ఏర్పాటు పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ వద్ద ఇంచార్జి ఎంఈవో శైలజ, అధికారులు,సిబ్బంది ఉన్నారు.

# పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

### ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** పంటలు ఎండిపోయి రైతులు బోరున విలపిస్తున్నా పట్టించుకోని అసమర్ధ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎంఎల్‌ఎ గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో మాజీ ఎంఎల్‌ఎ భూపాల్ రెడ్డితో కలిసి ఎండిన పంట పొలాలను, నిమ్మ తోటలను జగదీష్ రెడ్డి పరిశీలించారు. అన్నదాతలతో ముచ్చటించి,వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ మూసి ప్రాజెక్టు కింద నీరు అందించే అవకాశం ఉన్న ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నాగార్జునసాగర్ ఆయకట్టులో కూడా ఎగువ ఉన్న నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్‌ల నుండి నీటిని తెప్పించి రైతులకి అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్ళిన ఎండిన పంట పొలాలే దర్శనమిస్తున్నాయని, పెట్టుబడులన్నీ మట్టిలో కలిసిపోయి రైతులు విలపిస్తున్నారన్నారు. ఏ ఒక్క మంత్రి, ఎంఎల్‌ఎ, అధికారులు కూడా రైతుల వంక కన్నెత్తి చూడట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మంత్రులకు రాజకీయాలు, అక్రమ వసూళ్లు, దందాలు తప్పా, రైతుల గోడు పట్టట్లేదని విమర్శించారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌లు ఉత్తరకుమారులని, ప్రగల్భాలు పలకడం తప్పా దేని కి పనికిరారని అన్నారు. వారికి ఎంతసేపు రాజకీయాలు చేయడం తప్పా రైతుల సంక్షేమం ప ట్టలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య పూరి త వైఖరితో రైతులు మరింత అగాధంలోకి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి కరువుపై సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఉసురు తగి లి కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం అవుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, పంకజ్ యాదవ్, దీప వెంకట్ రెడ్డి, యాదయ్య గౌడ్, నాగరాజు, దేవేందర్, లింగుస్వామి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటా

### మాజీ ఎంఎల్‌ఎ చిరుమర్తి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మండల బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌ఎ చిరుమర్తి లింగయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పరిపాలనను గాలికి వదిలేసిందన్నారు. రైతులకు ఇంతవరకు రైతుబంధు డబ్బులు అకౌంట్‌లో జమా చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కన్నెబోయిన జ్యోతిబలరాం, సింగిల్‌విండో ఛైర్మన్ భిక్షంరెడ్డి, బిఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, ఎంపిటిసిలు వేమవరం సుధీర్‌బాబు, దోమల సతీష్, గాదె పారిజాత, నాయకులు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవ రెడ్డి, నీళ్ల దయాకర్, సాల్వేరు అశోక్, బత్తుల వెంకటేశం, పున్నా వెంకటేశం, అప్పం లక్ష్మి నరసింహా, కోళ్ల స్వామి, యాదయ్య, కూనూరు ముత్తయ్య, ఎండి. ఇనాయత్, జాడ సంతోష్, మిర్యాల మల్లేశం, బొడ్డు అల్లయ్య, సల్ల సత్యప్రకాశ్, మహేష్, నరేందర్, కిషన్, నరేందర్, శంకర్, శ్రీధర్, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ మంచినీటి సరఫరాపై క్షేత్రస్థాయిలతో ఏటూరునాగారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 3 నెలల పాటు ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తాగు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ప్రత్యేకించి తాగునీటిని వృధా చేయవద్దని, ఇళ్లు శుభ్రం చేసుకునేందుకు, ఇతర పనులకు తాగునీటిని వాడవద్దని, వీటికి ముడి నీటిని వాడాలని కోరారు. లీకేజిలు ఉన్న చోట వెంటనే అరికట్టాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీటితో పాటు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని అందరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. అవ సరం ఉన్నచోట హ్యాండ్ పంప్‌లు, బోర్‌వెల్స్ ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లేషం, డిప్యూటీ డిఈ రమా దేవి, డిఈ నాగేశ్వర్‌రావు, తహసీల్దారు, ఎంపిడిఓ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 9ఫిర్యాదులు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు పరి ష్కారానికి చర్యలు తీసుకో వాలని జిల్లా అదనపు కలె క్టర్ వెంకటేశ్వర్లు తెలి పారు. సోమవారం కలెక్ట రేట్ సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 9 ఫిర్యాదులు వచ్చాయని వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్య క్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వందశాతం పన్ను వసూలే లక్ష్యం



**ప్రజాపక్షం/తొర్రూరు :** మహబాదు జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో వంద శాతం ఆస్థిపన్ను వసూలే లక్ష్యం అని తొర్రూరు మున్సిపల్ కమీ షనర్ పి. శాంతి కుమార్ అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణంలో పేరుకుపోయిన ఆస్థి పన్ను వసూలు చేసే కార్యక్ర మంలో భాగంగా శాంతి కుమార్ మాట్లాడుతూ పట్టణంలో పేరుకుపో యిన ఆస్థి పన్ను వసూలలో భాగంగా కొన్నింటిని సీజ్ చేశామని, కొన్నిం టిని వసూలు చేయడంలో డప్పులతో విన్నూత్న నిరసన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఆస్థి పన్నుదారులకు నోటీసులు ఇచ్చి రెండు మూడు రోజులుగా సంబంధిత పేరుకుపోయిన బకాయిదారులకు మౌఖికంగా చెప్తున్నా ఇంత వరకు పన్ను కట్టని సముదాయాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ ఆస్తిపన్నుపై 90 శాతం మిన హాయింపు ఇస్తున్నదని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలన్నారు. వంద శాతం ఆస్తి పన్ను కట్టి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కట్టస్వామి, సిబ్బంది రాజు, దేవేం దర్, పట్టాభి, నవీన్, ఉపేంద్ర, శంకర్, యాకయ్య, మురళి పాల్గొన్నారు.

## జయముఖిలో ప్రాంగణ నియామకాలు

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీ రింగ్ కళాశాలలో సోమవారం క్యాస్పెడర్స్ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జానకి తెలి పారు. బిటెక్ ఫైనలియన్ చదువుతున్న సీఎస్‌ఈ, మెకానికల్, ఈఈఈ, విభాగంలో 165మంది విద్యార్థులు పేర్లు నమోదుచేసుకోగా రాత పరీక్ష, గ్రూప్ డిస్కర్షన్, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించగా 36మంది ఎంపికైనట్లు తెలిపారు. వీరికి నియామక పత్రాలను అందించా రని, బిటెక్ పూర్తి అయిన వెంటనే వారిని జాబ్‌లోకి తీసుకోవడం జరుగు తుందన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈకా ర్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ ప్రియాంక, కళాశాల యాజమాన్యం దేవేం దర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, డైరెక్టర్ వాహినిదేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రామ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## దైవభక్తితో సృజనాత్మక మార్పు..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** దైవభక్తి ద్వారా ప్రతి మని షిలో సృజనాత్మకమైన భక్తి పెరుగుతుందని నర్సా పూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అభిప్రాయప డ్డారు. సోమవారం మండల పరిధిలోని ఎదు ల్లాపూర్, గుండ్లపల్లి గ్రామం లో జరిగిన మల్లన్న స్వామి జాతర ఉత్సవా లకు స్వామి వారి కళ్యాణం, అగ్నిగుండాల పూజాది కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె దేవాలయంలో స్వామివారి మూలమూర్తుల విగ్రహాలను దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సునీతా లక్ష్మారెడ్డి మాట్లా డుతూ మల్లన్న స్వామి దయతో ఈ యేడు కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్థిల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ సర్పంచులు కలూరి కీర్తన హనుమంతరావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బిఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## మాస్ కాపీయింగ్ లేకుండా జాగ్రత్తలు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పోలీస్ కమిష నర్ అనురాధ ఆదేశాల మేరకు సోమవారం గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి పరిశీలించారు. గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ లోని వివిధ పరీక్షా కేంద్రా లను పరిశీలించిన అనంతరం సీఐ సైదాతో కలిసి ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సిఆర్‌పిసి సెక్షన్ విధించగా, పరీక్షలు జరుగు సమయంలో అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలని, పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువ మంది కానీ గుమికూడా వద్దన్నారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, మాస్ కాపీయింగ్‌కు విద్యా ర్థిని విద్యార్థులు పాల్పడకుండా అధ్యాపకులు తగు జాగ్రత్తలు తీసుకోవా లని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, పరీక్షల సమ యంలో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

# సిద్దిపేటలో 99.2... జనగామలో 99.84 శాతం

ప్రశాంతంగా పదవతరగతి పరీక్షలు ప్రారంభం

మాస్ కాపీయింగ్ నివారణ చర్యలు చేపట్టాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాం తంగా ముగిసాయి. జిల్లా వ్యాప్తంగా 13988 మంది విద్యార్థులు పరిక్షలు రాస్తుండగా 80 సెంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లాలో ప్రశాంత వాతా వరణంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనాయి. జిల్లాలో తోలిరోజు 13988 విద్యార్థులకు 13977 మంది హాజరుకాగ 11 మంది గైర్హాజరైనారు. 99.2 శాతం హాజరైనారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మల్టిపర్పస్, ఇందిరానగర్ జడ్పి హైస్కూల్ లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను, సెక్యూరిటిని క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఈసందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లా డుతూ పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి మాస్ కాఫియింగ్ జరుగకుండ కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వ హించాలని పరీక్ష కేంప్రాల సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ప్రజలు గుమి గూడకుండా చూసుకోవాలన్నారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు, రవాణ, పోలీస్ ఎస్కార్ట్‌తో నిర్వహిం చాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, సౌకర్యం తప్పని సరిగా ఉండాలన్నారు. ఎండకాలం కాబట్టి విద్యార్థులకు అందుబాటులో ఒఆర్ఎస్‌తో పాటు అవసరమైన మందులతో వైద్య శిబిరం తప్పక ఉండాలని జిల్లా కలె క్టర్ ఆదేశించారు.

**జనగామ జిల్లాలో 99.84 శాతం మంది హాజరు**

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** పదవ తరగతి పరీ క్షలు సోమవారం ప్రారంభం కాగా జనగామ జిల్లా అద నపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి వార్షిక పరీక్షల సరళిని తెలుసుకున్నారు. జనగామ, స్టేషన్‌ఘనపూర్‌లోని పలు కేంద్రాలను సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదోతరగతి పరీక్షల కోసం 41 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 6వేల 698 మంది పరీక్షలు రాస్తున్నారు.

జిల్లాలో మొదటి రోజు పదవ తరగతి పరీక్షలకు 99.84 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు డిఈఓ రాము తెలిపారు. 6698 మంది విద్యార్థులకు గాను 6687 మంది హాజరయ్యారని, 11మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారన్నారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పరీక్ష కేంద్రాలను సందర్శించగా వారిలో పాటు ప్రత్యేక బృందాలు 11 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారిగా 8 కేంద్రాలు మొత్తంగా 20 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు.

**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు**

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైన నేప థ్యంలో ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ ఆదేశాలతో ములుగు పట్టణం, మల్లంపల్లి, జాకారం, వెంకటాపూర్, బండారుపల్లిలో గల పరీక్ష కేంద్రాలను ములుగు డివ స్‌పి రవీందర్ పరిశీలించి అధికారులకు సిబ్బందికి తగు జాగ్రత్తలు సూచించారు.

**భద్రత పరిశీలించిన అదనపు కలెక్టర్**

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల పి శ్రీజ అన్నారు. సోమ వారం ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. ప్రహారి గోడ సరిగా లేని చోట భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.



**పరీక్షా కేంద్రాలు సందర్శించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**

**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి:** పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి , జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, వల్లూరి క్రాంతి ,జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌లు సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ,సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాల పరీక్షా కేంద్రాలను ప్రత్యేక్షంగా సందర్శించి అక్కడి భద్రత ఏర్పాట్లను పరీక్షా రాయడానికి వచ్చిన విద్యార్థులకు ఉండవలసిన తాగునీటి సదుపాయం ,అత్యవసర మెడికల్ సేవల గురించి పర్యవేక్షించారు. ప్రభుత్వం జారీ చేసిన 10వ తరగతి పరీక్షల నిర్వామణ గైడ్ లైన్స్ పాటిస్తూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి కావలసిన అన్ని రకాల ఏర్పాట్లను చేయడం జరిగిందని వివరించారు.





# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** భారతదేశ ఎన్ని కల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్ని కలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరిం చాలని, ఎన్నికల నిబంధనలు ఎవ్వరూ ఉల్లం ఘిస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ జిల్లా ఎన్ని కల అధికారి,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలి పారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలె క్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ బాలస్వామి, అద నపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లాలో ఎన్ని కల నిర్వహణపై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహ ణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూట్నీ, ఏప్రిల్ 29 వరకు నామినే షన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని తెలి పారు. మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని, మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, మెదక్ , నర్సాపూర్, సంగా రెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్ 7 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లలో ఓటరు జాబితా సవరణ, తుది ఓటరు జాబితా ప్రకారం 18 లక్షల 12 వేల 858 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అర్హు లైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేర్లు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేం దుకు అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల ప్రవ ర్తన నియమావళి పై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ, నెంబర్ , ద్వారా, సివిజిల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. జిల్లా కలెక్టరేట్లో ఫిర్యాదుల స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, సి విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదు పై చర్యలు తీసుకుంటారని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణ నలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ భారత ఎన్నికల కమి షన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలి పారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుం డా రూ. 50 వేలకు మించి నగదు తో ప్రయాణిం చవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లా లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమి టీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవె న్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు.

## నీటి సరఫరాలో ఇబ్బందులు వద్దు

బల్దియా కమిషన్ అశ్విని తాజానీ వాకడే



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవా లని బల్దియా కమిషన్ అశ్విని తాజానీ వాకడే అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధి 56వ డివిజన్‌లోని ఫిల్టర్ బెడ్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నగర ప్రజ లకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. ధర్మసాగర్ ఇంటెక్ వెల్‌ను పరిశీలించి రిజర్వాయర్ నుంచి బల్దియా పరిధిలోని మూడు ఫిల్టర్ బెడ్‌లకు నీరు చేరే విధానంతో పాటు స్థానికంగా ఉన్న ల్యాబ్‌లో నీటి నాణ్యత నిర్ధారణ విధానాన్ని, క్లోరినే షన్ ప్రక్రియతోపాటు నిర్వహించే రిజిష్టర్ వివరాలను సిబ్బందిని కమిషన్ అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో దేవాదుల నుంచి ఎల్‌ఎండీ నుంచి రిజ ర్వాయర్‌లోకి నీరు చేరే ప్రక్రియను అధికారులు కమిషనర్‌కు వివరించారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడిన కమిషనర్ గత ఐదేళ్ల నుంచి నీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అడిగి తెలుసుకు న్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాసరావు, డీఈలు సంతోష్, అజ్మీర శ్రీకాంత్, మిషన్ భగీరథ డీఈ జీవన్, ఏఈఈ మహేష్ పాల్గొన్నారు.

## మెదక్ పార్లమెంట్ బరిలో నిలుసుడే

టిపిసిసి సభ్యుడు,బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సూచనతో కాంగ్రెస్ బలోపే తమే లక్ష్యంగా పనిచేశానని, గత ప్రభుత్వం అనేక అక్రమ కేసులు పెట్టిన బయపడలేదని, తనకు కాంగ్రెస్ అధిష్టానం మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని టిపిసిసి సభ్యుడు,బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరి పల్లి చంద్రం అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దరిపల్లి చంద్రం మాట్లాడుతూ 2018లో ఢిల్లీ వేదికగా రాహుల్ గాంధీ ఆధ్వ ర్యంలో కాంగ్రెస్‌లో చేరానని, ఉత్తమ్,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,రేవంత్‌రెడ్డిల సూచనలతో నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్‌ని పటిష్టం చేయడానికి పని చేశానన్నారు. గత బిఆర్ఎస్ పార్టీ తనపై సుమారు 25 అక్రమ కేసులు పెట్టిన వెనుకడుగు వేయలేదని,2018/2023 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఎంఎ ల్‌ఏ అభ్యర్థిగా అవకాశం కోసం ఎదురు చూశానని,రేవంత్‌రెడ్డి హామీతో విర మించుకున్నానని తెలిపారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట నియోజ కవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 36వేల పైచిలుకు ఓట్లు వచ్చేలా కృషి చేశా నన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులకు చెందిన ఓట్లు 2లక్షలకు పైగా ఉన్నాయని,కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 1లక్షకు పైగా ఉన్నాయని వెనుకబడిన కుమ్మరి కులానికి రాజ కీయ ప్రాధాన్యత గుర్తించి తనకు అవకాశం కల్పించాలన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/హనుమకొండ:** వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేసినప్పుడు వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ములుగు రోడ్డు సమీపంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మధ్య తెలంగాణ మండల వ్యవ సాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం రెండు రోజుల సమావేశాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ వ్యవసాయ ఉత్పత్తు లకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయగా కలెక్టర్ వాటిని పరిశీలించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలె క్టర్ మాట్లాడుతూ రైతులు ఒకరి నుండి ఒకరు పంటల సాగు విధానంలో వారి వారి అనుభవాలను తెలుసుకుంటూ అనువైన పద్ధతులను అవలంబిం చడం వలన వ్యవసాయంలో గణనీయమైన ప్రగతిని సాధించవచ్చని పేర్కొ న్నారు. మెరుగైన పద్ధతుల కోసం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సల హాలు సూచనలు పాటిస్తూ లాభసాటి వ్యవసాయం దిశగా రైతులు సాగాల న్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా వివిధ పంటలలో విభిన్న రకాలను వృద్ధిచేస్తూ యాజమాన్య పద్ధతులను అవలంబించడంలో కృషిచేస్తున్న వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయ, మధ్య తెలంగాణ మండల వ్యవసాయ శాస్త్రవే త్తల కృషిని ప్రశంసించారు. ఈ సమావేశంలో ఎడిఆర్ రావుల ఉమారెడ్డి 2022 /23 సీజన్‌లో పరిశోధన ఫలితాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వాతావరణ పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, వివిధ పంటలలో చీటపీడల వలన కలిగిన నష్టం, వివిధ పంటలలో వృద్ధి చేసిన రకాలు, రాబోయే సీజన్‌లో విడుదల చేయబోయే రకాల గురించి తెలియజే సారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాల కులు డాక్టర్ పి. రఘురాంరెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. సుధారాణి, జెడిఎ సుజాత, వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఉషా దయాల్, హను మకొండ జిల్లా వ్యవసాయ శాఖ జెడి రవీందర్ సింగ్, డిహెచ్ఎస్ఓ శ్రీని వాస్, వరంగల్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం, నాబార్డు ఎజిఎం చంద్రశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ మాలతి, ఆర్ఇ ఎసి సభ్యులు రాణా ప్రతాప్, మధ్య తెలంగాణలోని 11జిల్లాల వ్యవసాయా ధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** సమస్యాత్మక వ్యయ ప్రాంతాలను గుర్తించాలని వరంగల్ జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా తో కలిసి కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగిన ఎన్ని కల జిల్లా ఇంటలిజెన్స్ కమిటి సమా వేశంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యాత్మక వ్యయ ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నా రు. మద్యం, గంజాయి, నార్కోటిక్స్ రవాణా జరగకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. ఇన్‌కం ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్, నార్కోటిక్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికలలో వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజక వర్గాలలో గుర్తించిన సమ స్యాత్మక వ్యయ ప్రాంతాలలో ప్రత్యేక శ్రద్ధ ఉంచి డబ్బు, మద్యం పంపిణీ జరుగకుండా చర్యలు తీసు కోవాలని అన్నారు. ఎన్నికలలో ప్రధానమైన టీంలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, వ్యయ నిర్వహణ కమి టీల పాత్ర ప్రధానమైనదని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహ ణకు తీసుకోవాల్సిన చర్యలపై కలె క్టర్ చర్చించారు. ఈ సమావేశంలో వరంగల్ నగర పాలక సంస్థ కమిష నర్ అశ్విని తానాజి వాకడే, ఆర్డీఓ క్రిష్ణ వేణి, ఇంటలిజెన్స్ డీఎస్పీ సత్య నారాయణ, నార్కోటిక్స్ ఎస్పీ సైదులు, ఐటి శాఖ నోడల్ అధికారి మహేందర్ బాబు, ఎక్సైజ్ కమిషనర్ నాగేంద్ర రావు, జెడ్పీ సీఈఓ రామి రెడ్డి, డిబిసిడిఓ పుష్ప లత తదిత రులు పాల్గొన్నారు.

## బాధ్యతతో ఎన్నికల నిర్వహణ చేపట్టాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** ఎన్ని కల నిర్వాహణను బాధ్యతతో సమర్ధ వంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. సోమ వారం కలెక్టరేట్‌లో పార్లమెంటరీ ఎన్ని కలపై సమీక్ష జరిగింది. ఈ సంద ర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లా డుతూ జనగామ జిల్లాలో మూడు నియోజక వర్గాలు ఉండగా స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలు వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్నా యన్నారు. ఎన్నికల నిర్వాహన కోసం అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. రోజువారి నివేధికలు అందించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్స్‌కై అధికారు లకు విదులు కేటాయించామని, విధులు సమర్ధవం తంగా నిర్వయించేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోవాల్సి ఉందన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ అప్రమత్తం చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతిని ధుల సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వాహణ తీరుపై ఓటర్ల జాబితా రూపకల్పన ఇవ్వవలసి ఉందన్నారు. ఎఫ్ఎస్‌టి , ఎస్ఎస్‌టి, టీమలు నియోజకవర్గా నికి మూడు చొప్పున నియమిం చడం జరిగిందాన్నరు. అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా రిసెప్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తూ పర్యవే క్షిస్తున్నామన్నారు. పార్లమెంట్ నియో జకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా నివేదకలను అందజేసేందుకు పూర్తి సహ కారం అందిస్తున్నామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆర్డిఓ వెంకన్న, అదనపు కలె క్టర్ రోహిత్‌సింగ్‌లు తమ సెగ్మెంట్లలో ఏర్పాటు చేపడు తున్న ఏర్పాట్లను వివిరంచారు. స్టేషన్‌ఘనపూర్‌లో 44, పాలకుర్తిలో 49 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎన్నికల అధికారులు అందరు అప్రమత్తమై సమర్ధవంగా పనిచేయాలన్నారు. ఈ పార్ల మెంట్ నియోజకవర్గ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేషన్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్‌డిఓలు, తహశీల్దా ర్లులు పాల్గొన్నారు.

## నర్సరీలలో మొక్కలు సంరక్షించాలి

అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ హమ్మద్



ప్రజాపక్షం/కుంటాల : మండలంలోని నర్సరీలలోని మొక్కలను సంరక్షించాలని అడిషనల్ కలెక్టర్ ఫైజన్ హమ్మద్ అన్నారు.సోమవారం మండలంలోని అందకుర్ గ్రామంలో సర్సరీని పరిశీలించారు.అనంతరం రూర్బన్ నిధులతో నిర్మించిన గోదాంలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న పనుల పై అరా తీశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎపిఒ నవీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/కడెం : ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే కడెం ప్రాజెక్టు కి పూర్తి స్థాయి మరమ్మత్తులకి దశల వారీగా ప్రాజెక్టుకి నిధులు ఇవ్వడం సంతోషకరమని యువజన కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి అన్నారు. కడెంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పాలన లో కనీసం గ్రీస్ కి కూడా డబ్బులు ఇవ్వక ప్రాజెక్టు ఎన్నోసార్లు భారీ వరద లకి తట్టుకోలేక ఆయకట్టు కింద ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడి సురక్షిత ప్రాంతాలకి వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కళ్ళల్లో ఆనందం నింపడానికి నేనున్నా అన్ని భరోసా కల్పిస్తూ మొన్న 5.46 కోట్లు,నిన్న ఎలక్ట్రికల్ పనుల కోసం 3.81 కోట్లు నిధులు మంజపురు చేసి ఆయకట్టు రైతాంగానికి అండగా నిలిచిందని కరెంట్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త కోసం నిధులు విడుదల చేయడం జరిగిందని సాగునీరు త్రాగునీరులకి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని అన్నారు.తక్కువ సమయం లోనే ప్రాజెక్టుకి ఎక్కువ నిధులు తెచ్చిన ఖానాపూర్ శాసనసభ్యులు బొజ్జు పటేల్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో కడెం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వాజీద్ ఖాన్,కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్ రెడ్డి,మార్జెట్ కమిటీ డైరెక్టర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకులాలలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : మైనారిటీ గురుకులాల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాల కొరకు మార్చి 31వరకు గడువు పొడిగించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.2024–25 విద్యా సంవత్సరానికిగాను తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల/కళాశాలలలో 5 వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు, అలాగే 6, 7, 8 తరగతులలో మిగిలిన సీట్లకు www.tmreis.telangana.gov.in వెబ్ సైట్ లో ధరఖాస్తు చేసుకోవాలని, ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే సమయంలో పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, జనన ధృవీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికేట్, కుటుంబ ఆదాయ సర్టిఫికేట్, కులం సర్టిఫికేట్ (అవసరమైనచో), సెల్ నంబరు, నివాస ధృవీకరణ సర్టిఫికేట్ జత చేయాలని అన్నారు. మైనారిటీ గురుకులాలలో ప్రవేశాలపై ఇతర వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి, పాఠశాలల లేదా కళాశాలల ప్రిన్సిపాళ్లను (పెద్దపల్లి గర్ల్స్ స్కూల్ – 7331170848, పెద్దపల్లి గర్ల్స్ కాలేజీ – 9603313883, రామగుండం బాలుర స్కూల్–7331170845, రామగుండం బాలుర కాలేజీ – 9948978628, మంథని గర్ల్స్ స్కూల్ 7995057944, మంథని గర్ల్స్ కాలేజీ 8096286629) నందు సంప్రదించాలని మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ ఆ ప్రకటనలో తెలిపారు.
కార్టున్ ఫోటో వాడుకోగలరు.

## పచ్చని పల్లెల్లో గుడుంబా మహమ్మారి చిచ్చు

ప్రజాపక్షం/మల్లాపూర్ : ప్రశాంతంగా ఉన్న పచ్చని పల్లెల్లో గుట్టు చప్పుడు కాకుండా గుడుంబా మహమ్మారి రోజురోజుకు విస్తరిస్తూ నిరుపేద కుటుంబాల్లో చిచ్చు రేపుతుంది. గోదావరి తీర ప్రాంతాల్లోని ఒకటి రెండు గ్రామాల్లో బట్టీలు ఏర్పాటు చేసుకుని గుడుంబా ను తయారు చేస్తూ మండలంలోని పలు గ్రామాలకు అక్రమంగా ద్విచక్ర వాహనాలపై రవాణా చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా గుడుంబా అమ్మకాలు జరపడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు దాన్ని కొనుగోలు చేసి సేవిస్తుండడంతో కట్టు బానిసలుగా మారుతున్నారు. గుడుంబా మహమ్మారితో తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని సంబంధిత అబ్కారీ శాఖ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతూ చేతులు దులుపుకోవడంతో అదే అదనుగా బావించిన తయారీదారులు తమ వ్యాపారాన్ని అంచెలంచెలుగా విస్తరిస్తున్నారు. పల్లెల్లో విస్తరిస్తున్న గుడుంబా తయారీదారి నిర్వాహకులపై అబ్కారీ అధికారులు దృష్టి సారించి అమ్మకాలను అరికట్టాలని బాధితులు కోరుతున్నారు.

## అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ సంబురాలు



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పిజి కళాశాల ఫేర్‌వెల్ పార్టీ వేడుక సంబరాలు 'బిదాయి నాట్ జుదాయి 2024' పేరిట సోమవారం స్థానిక రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో ఘణంగా జరిగాయి. కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి సంకశాల మల్లేష హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని డిగ్రీ కళాశాలలకు ధీటుగా కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఉన్నతస్థాయి విద్యాబోధన పద్దతులను పాటిస్తూ వాటికి ధీటుగా రాణిస్తుందని పేర్కొన్నారు. నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కరెస్పాండెంట్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులకు గ తంలో మాదిరిగా ఈ యేడాది అంతర్జాతీయ సంస్థలలో ప్రాంగణ నియామకాలను కల్పించామన్నారు. వివిధ బహుళజాతి కంపెనీలో ప్లేస్‌మెంట్‌లు సాధించిన విద్యార్థినులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ గోళి శ్రీనివాస వైస్ ప్రిన్సిపాల్స్ డా.బి.విజయలక్ష్మి , చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి,
కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి/నిర్మల్ టౌన్ : ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంసిసి సర్వేలెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్సు బృందాలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసిసి సర్వేలెన్స్ బృందాలు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే రాజకీయ పార్టీలకు, నాయకులకు అభ్యర్థులకు సంబంధించి వాహనాలు, ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు అందిచాలని సూచించారు. కరపత్రాలు, ప్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నెంబర్, అలాగే పబ్లిషర్ పేరు,వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని, ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సి ఉంటుందని తెలియపర్చాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, దీనిని పరిగణలోకి తీసుకొని ఎన్నికల నిర్వహనకు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్‌డిఓ రత్న కళ్యాణి, జడ్పి సీఈఓ గోవింద్, డీఈఓ రవీందర్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు జరిగేలా చర్యలు

పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పగడ్బందీంగా,ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం పట్టణంలోని రాంనగర్ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని సిసి కెమెరాల పనితీరును పరిశీలించిన అనంతరం కలెక్టర్ పరీక్షా కేంద్రంలోనికి వెళ్లి పరీక్షల నిర్వహణ సరళని పరిశీలించారు. పరీక్ష కేంద్రం ముందు భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాత లోనికి పంపాలని, సెల్‌ఫోన్,స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని ఆదేశించారు.ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి

డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామంలో ఇంటింటికి వివరించాలని సూచించారు గ్రామ, మండల,పట్టణంలోని వార్డు కమిటీలను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

## ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి,
ముజమ్మిల్ ఖాన్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : భారత ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం లోక్ సభ సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమవంతు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లతో కలిసి జిల్లాలో లోక్ సభ సాధారణ ఎన్నికల నిర్వహణపై ప్రెస్ మీట్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర 840 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్ కు రెండు కిలోమీటర్ల రేడియస్ లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర 2291 బ్యాలెట్, 1243 కంట్రోల్ యూనిట్లు, 1264 వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని ఎన్నికల కమీషన్ లోక్ సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని, రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని,ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 20 సర్వేలెన్స్ బృందాలను, 21 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, 14 వీడియో సర్వేలెన్సు బృందాలను, 8 వీడియో వ్యూయింగ్ బృందాలు, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని,ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సివిజల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. సి విజల్ యాప్ లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన వెంటనే గడువు లోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పాత్రికేయులు, సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ
అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 20 నుండి ప్రారంభం కానున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కూడలి నందీ చౌక్ చౌరస్తా నుండి దేవస్థానం వరకు ప్రధాన రహదారిని అలాగే వాహన పార్కింగ్ స్థలం, త్రాగునీటి సదుపాయం, గోదావరి నది వద్ద భక్తుల స్నానాలకు సంబంధించిన తదితర సౌకర్యాలను ఆలయ అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులతో కలిసి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులు సభ్యులను సమన్వయం చేసుకుంటూ సౌకర్యాలపై ఎప్పటికప్పుడు అన్ని విధాలా పర్యవేక్షించాల్సిందిగా అడ్లూరి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగనబట్ల దినేష్, వేముల రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, స్థంభంకాడి గణేష్, రాందేని మొగిలి, ఎదులాపురం మహేందర్, నేదుమూరి మహేందర్, పసునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేశం, రాపర్తి సాయి కిరణ్, దాసరి పురుషోత్తం, ముత్తినేని మల్లేశం, కొమురెల్లి పవన్ కుమార్, లసెట్టి సుజాత, జె. సుముఖ్, నర్సింలు పాల్గొన్నారు.

## పేదల పక్షాన నిలబడేది కాంగ్రెస్ ప్రభుత్వమే



ప్రజాపక్షం/మల్లాపూర్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేద ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందేలా చూస్తు పేద ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడుతుందని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కుస్తాపూర్ మొగిలిపేట సంగెం శ్రీరాంపూర్ గ్రామాలకు చెందిన 200 మంది బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బిడ్డగా, పేద ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని, ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తుండడంతో అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు. కాగా కుస్తాపూర్ తాజా మాజీ సర్పంచ్ సరికెల లక్ష్మి మహిపాల్ తన వర్గానికి చెందిన సుమారు 100 మందితో కలిసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోగా నర్సింగరావు వారిని అభినందించి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నాయకులు జువ్వాడి కృష్ణారావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు జలపతి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు నల్ల బాపు రెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రేగుంట ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, మరిపెల్లి మల్లయ్య, ఆనంద్ గౌడ్, ఎర్ర భూమయ్య, నూతిపెల్లి రాజం, వివిధ గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కార్మికనేత జనక్‌కు సింగరేణి కార్మికుల సన్మానం



ప్రజాపక్షం/యైటింక్లయిన్ కాలనీ : ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల సింగరేణి రామగుండం మూడవ డివిజన్ యూనియన్ నాయకులు కార్యకర్తలు సోమవారం హర్షం ప్రకటించారు. ఉదయం ఏరియా నాయకత్వం ఆధ్వర్యంలో ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరైన నాయకులు బి.జనక్ ప్రసాద్‌ను ఏరియా యూనియన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కార్మికులు శాలువా కప్పి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు గడ్డం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సుమారు 40 సంవత్సారాలుగా కేవలం ఒక్క సింగరేణి పరిశ్రమ కార్మికుల కోరకే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం హక్కుల కొరకు అహర్నిశలు పాటు పడుతున్న గొప్ప కార్మిక నాయకుడు జనక్ ప్రసాద్ అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుగంటి వెంకటస్వామి, బత్తుల పోషయ్య, జి.మల్లికార్జున్, బూర జగన్ మోహన్, పుట్ట రమేష్, లక్ష్మయ్య, కుమారస్వామి, బుర్ర రాజశేఖర్, బొల్లి సమ్మయ్య, లక్ష్మణ్, బాబా తదితరులు పాల్గొన్నారు.


## సందేహాస్పద నగదు లావాదేవీలపై నజర్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్




ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : పెద్దపల్లి పార్లమెంటు జిల్లాలో గల మూడు శాసనసభ నియోజకవర్గాలలో లోక్‌సభ ఎన్నికలు 2024 జరుగనున్న సందర్భంగా బ్యాంక్‌ల పరిధిలో జరిగే అనుమానిత నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని గల సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్‌లతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, అనధికార , అనుమానిత నగదు లావాదేవీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్యపెట్టేందుకు వివిధ దశలుగా బ్యాంకుల ద్వారా జరిగే అనుమానిత నగదు లావాదేవీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బ్యాంక్ పరిధిలో లక్ష రూపాయల కంటే ఎక్కువగా నగదు జమ అయినా, తీసుకున్నా వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలని , ఓకే ఖాతా నుండి వివిధ ఖాతాలకు నగదు తరలింపు జరిగినట్లయితే వివరాలను పరిశీలించాలని తెలిపారు. పది లక్షల రూపాయలకు మించి నగదు జమ అయినా, తీసుకున్నా ఆదాయ పన్ను శాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. అనధికార, అనుమానిత నగదు లావాదేవీల వివరాలను ఎన్నికల సంఘంచే సూచించిన నమూనాలో పొందుపర్చి నివేదిక అందించాలని తెలిపారు. బ్యాంకు ఎటిఎం, బ్యాంక్ చెస్ట్, వివిధ శాఖలతో పాటు బ్యాంకులకు సంబంధిత ఇతర ప్రాంతాలకు నగదు తరలించే సమయంలో సంబంధిత వ్యక్తులకు బ్యాంకు వారిచే జారీ చేయబడిన అధికారిక గుర్తింపు కార్డు, తరలించే నగదు పూర్తి వివరాలతో ధృవీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి సంబంధించిన ఉత్తర్వులను అన్ని బ్యాంకులకు అందించడం జ రిగిందని తప్పకుండా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ బ్యాంకుల అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.


## మినీ విమానాల చెక్కర్లపై ప్రజలు ఆందోళన





ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామం మీదుగా గత వారం రోజుల నుండి జెట్ మినీ విమానాలు తక్కువ ఎత్తులో చెక్కర్లు కొట్టడం పై గ్రామస్తులు కొంతమంది భయాందోళనకు గురికాగా, మరి కొంతమంది విమానాలు చూస్తూ ఆనంద పడుతున్నారు. కానీ గత 15 రోజులుగా ఈ మినీ విమానాలు ఎందుకు ఇంత కిందిస్థాయి ఎత్తులో ఎందుకు వెళ్తున్నాయి. అనే కోణంపై పలువురు ఆలోచనలో పడ్డారు. దీనిపై సంబంధిత అధికారులు మాత్రం సరైన సమాధానం చెప్పడం లేదు. కొంతమంది నేషనల్ రోడ్డు సర్వే కోసం స్పెషల్ బృందం అధికారులు తిరుగుతున్నారంటూ..? మరి కొంతమంది అయితే మావోయిస్టు ఏరువేత కోసమే పోలీసుల గాలింపు చర్యలో భాగమే అని మరి కొంతమంది ఎవరికి వారే యమునా తీరే అన్నచిందంగా అనుకుంటున్నారు. అసలు ఈ జెట్ మినీ విమానాలు ఇంత కింద ఎత్తులో వెళ్లడంపై పలువురు విమానాలు చూసేందుకు ఇండ్ల నుండి బయటకు వచ్చి చూస్తూ సంతోషపడుతుండగా మరి కొంత మంది అసలు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ ఉంటుందా?









ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : ఉమ్మడి జిల్లా అదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి అధిష్టానంతో చర్చలు జరుపుతున్న వేళ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల్లో కన్ఫ్యూజన్ మొదలైంది. టిక్కెటు ఎవరికి వరిస్తుందో అని లంబాడా వర్సెస్ అదివాసుల మధ్య మరింత తీవ్రమైన పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైనే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. కాంగ్రెస్ కన్ఫ్యూజన్ వీడే వరకు ఎవరు గెలుస్తారో ఎవరు ఓడుతారో అనేది రాజకీయ విశ్లేషకులు కూడా అంచనాకు రావట్లేదని చెప్పాలి. ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీలో నుండి వెళ్లి బిజెపి పార్టీ టికెట్ తెచ్చుకున్న గొడం నగేష్‌కు బిజెపి పార్టీలో వ్యతిరేకత మొదలై ఆందోళన కార్యక్రమలు కొనసాగుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీత కూడా మాజీ ఎంఎల్‌ఎని నిలబెట్టడం కొంత బిఆర్ఎస్ పార్టీకి అనుకూలమైన వాతావరణమే ఉందని చెప్పచ్చు, అయితే కాంగ్రెస్ పార్టీ లంబాడాలకు ఇస్తుందా ఆదివాసులకు కేటాయిస్తుందా అని కన్ఫ్యూజన్లో ఇద్దరు అభ్యర్థులు ఉన్నారని చెప్పాలి లంబాడలకి ఇస్తే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఎక్కువ గెలుపు అవకాశాలు కనిపిస్తున్నాయి. లంబాడాలకు కాదని ప్రస్తుత ఖానాపూర్ ఎంఎల్‌ఎకు ఒకవేళ టికెట్ కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు కూడా ఎక్కువనే కనిపిస్తున్నాయి. జిల్లాలో బిఆర్ఎస్, బిజెపి బలాబాలాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం ఉన్నప్పటికీ ఇంతవరకు చేరుకపోవడంతో కొంత విజయ అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో ఆదివాసి అభ్యర్థికి టికెట్ కేటాయిస్తున్నట్లయితే కాంగ్రెస్‌కు విజయ అవకాశాలు లేకపోలేదని. బిజెపి అభ్యర్థి వ్యతిరేకతతో బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థికే ఓట్లు క్రాస్ అవుతాయని ప్రచారం కూడా లేకపోలేదు. అదే జరుగుతే అదిలాబాద్ సెట్టింగ్ ఎంపీని బిజెపి కోల్పోయినట్లే.

**కాంగ్రెస్ టికెట్ ఎవరికీ...?**
**వేద్మ బొజ్జుకా లేక రేఖ శ్యాం నాయక్‌కా..!**

అదిలాబాద్ పార్లమెంటు టికెట్ కోసం దాదాపు 40 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తె లుస్తుంది. ముఖ్యంగా ఉపాధ్యాయులైన అత్రం సుగుణ, మరో ప్రభుత్వ ఉద్యోగి ఆత్రం బాపురావు జోరుగా ప్రచారం చేసుకున్నప్పటికి వీరికి ఎ వరికి కాదని సిట్టింగ్ ఎంఎల్ఎ వేద్మ బొజ్జుకు లేదా రేఖ శ్యాం నాయక్‌కు టికెట్ అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి వేణుగోపాల్‌కు దగ్గర బంధువైన రేఖ శ్యాం నాయక్ గట్టిగానే పట్టుబట్టినట్లు తెలుస్తుంది. ఈ సారి ఎట్లయినా ఎంపి టికెట్ ఇవ్వాలని నేను గెలుస్తాననే ధీమ వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది అయితే ఇది ఎలా ఉన్న ఆదివాసులకే టిక్కెట్ ఇచ్చి గెలిపించుకోవాలని, కాంగ్రెస్ జాతీయ కమిటీ ఆలోచిస్తుందట. మహబూబాబాద్‌ను లంబాడాలకు కేటాయించామని ఈ సారి ఆదిలాబాద్ జిల్లాను ఆదివాసులకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతుంది. అది కూడా సిట్టింగ్ ఎంఎల్ఎగానే ఉంటాడనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

## పేకాట స్థావరాలపై పోలీస్ దాడి

8 మందిపై కేసు నమోదు
93,950 నగదు స్వాధీనం

ప్రజాపక్షం/రామగిరి : రామగుండం పోలీస్ కమిషనరేట్, రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గల బేగంపేట గ్రామ శివారులో గల గుట్ట ప్రాంతంలో ఆదివారం రాత్రి సమయంలో పేకాట ఆడుతున్న స్థావరంకు వెళ్లి 8 మంది వ్యక్తులను పట్టుకోవడం జరిగిందని రామగిరి ఎస్సై సందీప్ కుమార్ సోమవారం తెలిపారు. పట్టుబడిన వారి వద్ద 93,950/ రూపాయల నగదు లభించగా వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు.పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో బేగంపేట్ గ్రామానికి చెందిన బిటుకు కొమురయ్య, తోట రాజ్ కుమార్, తాళ్లపల్లి నరేష్, గరిగంటి సదయ్య, ఎండి అజిద్, పోతరవేణ శంకర్, తాళ్ల రాజయ్య, కుంట రాజు వీరిపై కేసు నమోదు చేసి 93,950 రూపాయలు నగదు సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.

## నష్టపరిహారం చెల్లించాలని
# రైతుల ధర్నా



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : సింగరేణి ఓపెన్‌కాస్ట్2 గని కోసం భూములు కోల్పోయిన తమకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలంటూ సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని ఫకీర్ గడ్డ, ఆకుదారి వాడా గ్రామాల రైతులు ఓసి2 1ఇంక్లైన్ రహదారిపై బైఠాయించారు. దాంతో రోడ్డుపై పెద్ద ఎత్తున బొగ్గు లారీలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల క్రితం సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గని కోసం తమ భూములు స్వాధీనం చేసుకున్నదని, అప్పటి నుంచి ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓపెన్ కాస్ట్ గని నుంచి వచ్చే దుమ్ము ధూళి ద్వారా ఎంతో మంది తమ కుటుంబ సభ్యులు రోగాల పాలవుతూ మరణిస్తున్నారని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి తమను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, తగిన నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఓపెన్‌కాస్ట్ గనిని స్తంభింప చేస్తామని హెచ్చరించారు. కాగా విషయం తెలుసుకున్న సింగరేణి జిఎం బళ్లారి శ్రీనివాస్ మీడియా సమక్షంలో ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు మార్చి 25 తేదీ లోపు సింగరేణి చైర్మన్ తో కల్పించి మాట్లాడిస్తానని హామీ ఇవ్వగా.. ఒకవేళ 25 తారీకు లోపు తమకు న్యాయం జరగకుంటే ఈ ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని తెలిపి రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో రైతులు బుర్ర రమేష్ గౌడ్, బుర్ర రాజయ్య, సెగ్గెం శంకర్, ఎస్ కే యాకూబ్, కోల రాయమల్లు, బుర్ర సమ్మయ్య, భీమనపల్లి మహేందర్, బుర్ర అనిల్, సెగ్గెం ఎల్లారం, బుక్క రవి, దాస్యం రవికుమార్, కంచర్ల బాలయ్య, రాజేందర్ నాయక్, ఇస్లావత్ సమ్మయ్య, విస్లావత్ బాలు నాయక్, గుర్రం కిష్టయ్య, కెక్కర్ల మధున, మేడిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ జాతీయ ఉపాధిహామీ చట్టం రూపొందించాలి

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్



ప్రజాపక్షం/వలిగొండ : భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని దువ్వపల్లి గ్రామంలో ఎఐవైఎఫ్ స్తూపం వద్ద భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా ప్రచార కరపత్రం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్ ల వర్ధంతి సందర్భంగా వలిగొండ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 23నుంచి ప్రారంభం వలిగొండ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆరూరు గ్రామంలో నిర్వహించడం జరుగుతున్నదన్నారు. యువతను ప్రోత్సహించేందుకు వారిలో ఉన్న క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఎఐవైఎఫ్ వలిగొండ మండలంలోని మండల స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేస్తున్నదని క్రీడాకారులను ఆహ్వానిస్తున్నాము అని అన్నారు. భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలిపేవిధంగా భాధ్యత పాలకులదేనని ఉద్ఘాటించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి నయీమ్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎరె కిరణ్, సుద్దాల సాయికుమార్, సభ్యులు మేడి దేవేందర్, మెట్టు లక్ష్మీ నారాయణ, మామిడికాయల నరేష్, బాలగోని రాజు,మారోజు నరసింహాచారి, అంతటి రాము, రాపోల్ పవన్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి నరిగే యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా సివిల్‌సప్లై కార్మికులు : ఎఐటియుసి డిమాండ్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : సివిల్ సప్లై హమాలీలుగా పనిచేస్తున్న కార్మికులంను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డు నందు జరిగిన సివిల్ సప్లై కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా కష్టకాలంలో పౌరసరఫరాలశాఖ ఆదేశాలకు అనుగుణంగా హమాలీ కార్మికులు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి నిత్యవసర సరుకులు సరఫరా చేశారని వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగస్తులతో పాటు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి సివిల్ సప్లై కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగస్తులుగా పరిగణించి అసెంబ్లీలో జీవో తీర్మానం చేసేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేద మధ్య తరగతి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఫించన్లను పార్టీలకు అతీతంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై కార్మికులు బానోతు సైదులు, పండగ వెంకన్న, పొనుగోతు గోపి, బెల్లంకొండ రామ్మూర్తి, జెట్టి వెంకన్న, వెంకటాద్రి, జక్కుల మల్లయ్య, కోటేశ్వరరావు, చక్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు సాగునీరు అందించండి



ప్రజాపక్షం/జఫర్గడ్ : ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం వెంటనే రిజర్వాయర్ ద్వారా చెరువులు కుంటలు నింపి పంటలకు సాగు నీరు అందించాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య కోరారు. మండలంలోని సూరారం, తీగారం గ్రామాలలో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చెరువు ఆయకట్ట పరిధిలోని రైతులు సాగుచేసిన వరి నీరు లేక ఎండుతుందన్నారు. నీరు పుష్కలంగా ఉందని రైతులు ఎంతో ఆశగా నాట్లు వేశారు. కానీ వర్షాభావ పరిస్థితుల వల్ల నీరు రాకపోవడంతో రైతులు ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం పంట పొలాలు పొట్ట దశలో ఉన్నాయి. ఆరుకాలం కష్టపడి మీరు పొలాలకు అందకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పచ్చని పొలాలను పశువులను మేపుతున్నారని ప్రభుత్వం చొరవ తీసుకొని రిజర్వాయర్‌లో ఉన్న నీళ్లను కాలువల ద్వారా చెరువులను కుంటలను నింపి రైతు పొలాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీరటి కొమురయ్య, ఎర్ర రవి, వెన్నపూస, నాంపల్లి సముద్రాల రాజన్న, నర్సింగ్, రాజు, మాద్రాజు యాదగిరి, సముద్రాల రంజిత్, వెన్నపూస సంపత్ పాల్గొన్నారు.

## మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి వినతి



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: సింగరేణి వ్యాప్తంగా నెలకొన్న మైనింగ్ స్టాఫ్ సమస్యల పట్ల భూపాలపల్లి ఏరియాలో సోమవారం అన్ని గనుల మేనేజర్లకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మెమోరండం ఇవ్వడం జరిగింది. సింగరేణికి వెన్నెముక అయినటువంటి మైనింగ్ స్టాప్ సమస్యలు యాజమాన్యం వెంటనే పరిష్కరించి వారికి తగు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనుల,డిపార్ట్మెంట్లలో మేనేజర్ల ద్వారా సిఎండికి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ తోట రామచందర్, మైనింగ్ స్టాప్ బ్రాంచ్ నాయకులు సికిందర్ సింగ్, ఆసిఫ్ పాషా, పి.నారాయణ మూర్తి తిరుపతి రెడ్డి, అంకం శ్రీనివాస్, సురేష్, జి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, టి రాజన్న, టీ లక్ష్మణామూర్తి, పి శ్రావణ్, గణేష్, అసిస్టెంట్ బ్యాలెన్స్ సెక్రటరీ ఎం విజయేందర్, ఎల్ శంకర్, అజయ్, శివ, రవి, రత్నం, కృష్ణమూర్తి సుదర్శన్ నరేందర్ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి : సిపిఐ



ప్రజాపక్షం/నాంపల్లి : డిండి ఎత్తిపోతల, నక్కలగండి ద్వారా నీరు అందించే దిశగా కిష్టారాయినిపల్లి, చర్లగూడెం ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల ప్రజలకు సాగునీరు, తాగు నీరు అందించాలని, నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాగిపని అంజాచారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇసాక్‌కు నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజాచారి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతాన్ని మాత్రమే అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అన్ని అనుమతులు పొందిన డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా చిత్తశుద్ధి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు నిరుపయోగంగా మార్చారని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన ఆరోపించారు. వర్షాలు లేక బోరు బావులు ఎండిపోయి రైతులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు సాగు చేస్తున్న వరి పంటలు, వేరుశనగ, పుచ్చకాయ, మొక్కజొన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పశుగ్రాసం లేక త్రాగడానికి నీరు లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నాంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయకార్యదర్శులు ఊరుపాక వెంకటయ్య, రాజు, సత్తయ్య, వెంకటయ్య, యాదయ్య, లక్ష్మయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

## లక్ష్యాలు సాధించడానికి కృషి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్



ప్రజాపక్షం/కరీంనగర్ : భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు వినియోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకుని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ కోరారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల రక్షణ చట్టం, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. గృహహింస నిరోధక చట్టం, పనిచేసే ప్రదేశాలలో మహిళలకు రక్షణ చట్టం, మాదక ద్రవ్యాల నిరోదక చట్టం, మహిళలకు సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సరిత, శిక్షణ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు

కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఎలక్షన్ కమిషన్ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం నడుచుకోవాలని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సభలు, సమావేశాల నిర్వహణకు 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలని సూచించారు. సువిధ కింద ఆన్‌లైన్‌లో అనుమతి కోసం ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందిస్తామని, వారు ఓటు హక్కు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే ఘటనలు దృష్టికి వస్తే సి విజిల్ యాప్లో అప్పటికప్పుడే ఫోటోలు, వీడియోలు డౌన్‌లోడ్ చేసి పెట్టవచ్చని సూచించారు. వెంటనే అధికారులు చేరుకుని చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల నిబంధనలు, అనుమతులు, అభ్యర్థుల ఖర్చుల వివరాలు, రాజకీయపార్టీల నేతలకు అధికారులు అవగాహన కల్పించారు. పలు అంశాలను వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల దేశాయ్, లక్ష్మి కిరణ్, డిఆర్ఒ పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్, టౌన్ ఏసిపి నరేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, నాంపల్లి శ్రీనివాస్, అనిల్ కుమార్, కళ్యాడపు ఆగయ్య, మిల్కూరి వాసుదేవరెడ్డి, శివ పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : రాజకీయపార్టీలన్ని ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా లోకసభ ఎన్నికల షడ్యూల్ ప్రకటించటంతో ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు తప్పకుండ పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియలో వివిధ అనుమతులు సంబంధించి సువిధ ఆప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటంతో పాటు, నేరుగా సైతం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పోస్టర్లు, పాంప్లెట్లు ముద్రించేటప్పుడు వాటిమీద ప్రింటర్స్ అడ్రస్ కూడ ఖచ్చితంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియ నిఘా ఉంచేందుకు కలెక్టర్ కార్యాలయంలో ఇంటిగ్రెటేడ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. సివిజిల్, 1950 టోల్ ప్రీ నెంబర్, నేషనల్ గ్రీవెన్స్ నెంబరు, నేషనల్ రిడ్రేసెల్‌వింగ్, ఎంసిఎంసి తదితర వింగ్స్ ఉంటాయన్నారు. 85సంవత్సరాలపై బడిన వారికి హోమ్ ఓటింగ్ అవకాశం ఉంటుందన్నారు. సమావేశంల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మోహన్‌లాల్, శ్రీనివాస్‌రెడ్డి, అత్తు ఇమామ్, గయాసోద్దీన్, మునీర్, రవికుమార్, ప్రశాంత్, ఎలక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఎలక్షన్ డిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



ప్రజాపక్షం/పాన్‌గల్ : మహిళా, శిశు సంక్షేమ శాఖ వనపర్తి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పాన్‌గల్ మండలం దావాజీపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు బాలల హక్కులు, రక్షణ చట్టాలపైన అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం. రాంబాబు హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల చేయడం వల్ల ఎదురయ్యే పరిణామాల గురించి వివరించారు. పోషకాహారం , ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య, ప్రాముఖ్యత, వేసవి కాలంలో పిల్లల సంరక్షణ గురించి వివరించారు. ఆన్‌లైన్ సైబర్ నెరాల పైన ఆన్‌లైన్ భద్రత, పిల్లల భద్రత, మాధకద్రవ్యాల వినియోగాలు, మంచి స్పర్శ, చేడు స్పర్శ అత్యవసర సమయంలో ఉపయోగించవాల్సిన టోల్ ఫ్రీనంబర్లు 1098,112,181, 100 నంబర్లపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి ఎం.నరేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రాజేష్ కుమార్, దావాజీపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.గోపాల్‌గౌడ్, మహిళ సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అదనపు కలెక్టర్, జివి శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని,ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని, సివిజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు 24 గంటల పాటు నమోదు చేయవచ్చని,రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలునిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, సువిధా యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించవద్దని, ఎన్నికల ప్రచారం పాఠశాలలో నిర్వహించవద్దని, ఎక్కడ చిన్న పిల్లలను ఉపయోగించడానికి వీలులేదన్నారు.రాబోయే లోక్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లాలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, సివిజల్ యాప్ లో నమోదైన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయడం, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రా ధాన్యం రాకుండా చర్యలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ప్రజాపక్షం/మిర్యాలగూడ: ఆంధ్రా ప్రాంతం నుంచి తెలంగాణ వైపు ధాన్యం రాకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అడ్డుకుంటున్నామని జేసీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేసణ్ భవనంలో మిల్లర్లతో సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం దిగుమతుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగింకుండా మిల్లర్లు అర్థం చేసుకోని సాధ్యమైనంతవరకు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనేక ప్రతికూల పరిస్థితుల నడుమ రైతులు పంటలు సాగు చేశారని, కొనుగోలు విషయంలో వారిని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, మిల్లర్స్‌తో సంయుక్తంగా ప్రత్యేక మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి ధాన్యం దిగుమతులు సకాలంలో జరిగేలా చూడాలన్నారు. ఏ సమయంలోనైనా ధాన్యం ట్రాక్టర్లు మిల్లుల వద్దకు వచ్చిన వెంటనే దిగుమతి అయ్యేలా చూడాలన్నారు. 48 గంటల్లో రైతుల సమస్యలు పరిష్కారం కాకుంటే గతంలో మాదిరిగానే టోకెన్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయ సంచాలకులు శ్రవణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ హరిబాబు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, వెంకటరమణచౌదరి, రేపాల మధుసూదన్, బండారు కుశలయ్య, ధనమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## నీటి సరఫరాపై పక్కా ప్రణాళిక



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : వేసవిలో తాగునీటి సరఫరాపై పక్కా ప్రణాళిక ఉండాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్ ఆదేశించారు. తాగునీటి సమస్య, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీడీఎంఏ డైరెక్టర్ దివ్య దేవరాజన్ హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు లోకల్ బాడీస్ ఉమ్మడి జిల్లాల ఈఈలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో బాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనిరాజకీయ పార్టీల బ్యానర్లు, క్యాలెండర్లు, ఫోటోలు, ప్రభుత్వ పథకాల ప్రచార పోస్టర్లు 24 గంటల్లో తీసి వేయాలని, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ ఇతర సంస్థలవద్ద ఉన్న వాటిని 48 గంటల్లో, ప్రైవేట్ స్థలాలోని వాటిని 72 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికే పరిపాలన అనుమతులు పొంది మొదలైన ప్రభుత్వఅభివృద్ధి పనులు, పరిపాలన అనుమతులు పొంది ఇంకా మొదలు కాని పనుల వివరాలు సీఈఓకు పంపాలని సూచించారు. తాగునీటి సరఫరాపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. నీటికి వనరులు ఎక్కడా ఉన్నాయి? వాటిలో నిల్వ ఎంత ఉన్నాయి? ప్రత్యామ్నాయలు పవర్ బోర్లు, బావులు ఏమి ఉన్నాయో చూసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో పర్యటించాలని ఆదేశించారు. నీటి సరఫరా, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా అని పరిశీలించాలని తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో సిద్దంగా ఉండాలని, మున్సిపాలిటీల్లో మైక్రోప్లాన్ తో ఉండాలని వివరించారు. బల్దియాల పరిధిలో ప్రతీ ఇంటికి, చివరి గృహాలకు తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటికి సంబంధించి చేపట్టే పనులకు ఎస్డీఎఫ్, బల్దియాల్లో జనరల్ ఫండ్ వాడుకోవాలని వెల్లడించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై దృష్టి పెట్టాలని, పక్కదారి పట్టకుండా చూసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతలు నిర్మించాలి వాన నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించాలనే విషయంపై అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ఉండేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. నూతనంగా నిర్మించే భవనాలకు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com